నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
శనివారం | 09 డిసెంబర్ 2023 | www.navatelangana.com

గ్రామ శివారులో ఇథనాల్ పరిశ్రమ వద్దు



నవతెలంగాణ-బెజ్జంకి

మా గ్రామ శివారులో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ పరిశ్రమ వద్దని హుస్నాబాద్ డివిజన్ డీఎల్ పీఓ వీరభద్రయ్య ఎదుట గుగ్గిళ్ల గ్రామస్తులు ప్రాదేయపడ్డారు. ఇథనాల్ పరిశ్రమ నిర్మాణాన్ని, అనుమతులను ప్రభుత్వం రద్దు చేయాలని గ్రామస్తులు చేపట్టిన నిరవధిక దర్నాకు శుక్రవారం డీఎల్ పీఓ వీరభద్రయ్య ఎంపీఓ విష్ణు వర్దన్, పరిశ్రమ యాజమాన్యంతో కలిసి మండల పరిధిలోని గుగ్గిళ్ల గ్రామ పంచాయతీ కార్యలయం వద్ద పంచాయతీ పాలకవర్గం సభ్యులు, గ్రామస్తులతో పరిశ్రమ నిర్మాణంపై అభిప్రాయ సేకరణ చేశారు. గ్రామస్తుల అభిప్రాయాల నివేదికను జిల్లా పరిపాలనాధికారికి అందజేస్తానని డీఎల్ పీఓ వీరభద్రయ్య తెలిపారు.

దివ్యాంగుల అభివృద్ధికి తోడ్పాటు



నవతెలంగాణ - పటాన్ చెరు

దివ్యాంగులను చిన్న చూపు చూడకుండా వారి అభివృద్ధికి తోడ్పాటు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మస్కులర్ డిస్ట్రఫీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడపతి రవికుమార్ అన్నారు. మండల పరిధిలోని ఇస్నాపూర్‌లో యువ చైతన్య ఇస్నాపూర్ దివ్యాంగుల సంఘం అధ్యక్షులు కంచిగారి మహేష్, కార్యదర్శి కంజర్ల జ్యోతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా ఇస్నాపూర్ జడ్పీ హెచ్‌ఎస్ విద్యార్థులతో శుక్రవారం నిర్వహించిన దివ్యాంగుల ఆత్మగౌరవ అవగాహన ర్యాలీలో మస్కులర్ డిస్ట్రఫీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడపతి రవికుమార్ మాట్లాడారు. జై దివ్యాన్, దివ్యాంగులని గౌరవించాలి, దివ్యాంగుల అభివృద్ధికి తోడ్పాటు అందిద్దాం, దివ్యాంగులని వైకల్యం పేరుతో పిలవద్దు అని నినాదాలు చేశారు. అనంతరం దివ్యాంగుల పైన వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాస ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన దివ్యాంగులు స్టీపెన్ హకింగ్, హెలన్ కిల్లర్, నిక్ వుజిసిక్ వీరి గురించి విద్యార్థులు ఎంతో చక్కగా వ్యాసాలు రాసి బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ దివ్యాంగులను చిన్నచూపు చూడకుండా వారిని ఆత్మగౌరవం వైపు నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుందర్ రావు, భాస్కర్, జయశ్రీ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీ జర్నీ

- నేడు మహాలక్ష్మీ పథకం షురూ
- మహిళలు, బాలికలు, థర్డ్‌జెండర్‌కు ఉచితం
- వయసు నిమిత్తంలేదు.. ఆధార్ ఉంటే చాలు
- సిటీ, ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులకే పరిమితం
- రాష్ట్ర సరిహద్దు వరకు.. తెలంగాణ వాళ్లకే ఛాన్స్
- జీవో నెంబర్ 47 అమలుకు ఆర్టీసీ సిద్ధం
- బస్సులు నడవని వందలాది గ్రామాలు
- ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు : ఆర్ఎం ప్రభులత



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మెదక్ రీజియన్ పరిధిలో సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలున్నాయి. ఈ మూడు జిల్లాల్లో 8 ఆర్టీసీ డిపోల పరిధిలో 596 బస్సులు నడుస్తున్నాయి. ప్రతి రోజు రెండు లక్షల 9 వేల కిలో మీటర్లు ప్రయాణిస్తూ లక్షా 75 వేల మంది ప్రయాణికుల్ని గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. ప్రయాణికుల్లో 45 శాతం మంది మహిళలుంటున్నారని అధికారులు చెబుతున్నారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే ఉచిత ప్రయాణానికి అనుమతిస్తారు. మెదక్ రీజియన్‌లో 353 పల్లెవెలుగు బస్సులు, మిగతావి ఎక్స్‌ప్రెస్ బస్సులున్నాయి. మహిళలు, థర్డ్ జెండర్‌వాళ్లు వయసుతో నిమిత్తం లేకుండా ప్రయాణం చేయడానికి అనుమతిస్తారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన మహిళలు, థర్డ్‌జెండర్స్‌కు మాత్రమే అవకాశం ఉన్నందున ఆధార్ ద్వారా గుర్తించనున్నారు. ఆధార్ లేకపోతే తెల్లరేషన్‌కార్డు చూపినా పర్వాలేదు. ఇతర రాష్ట్రాల వారికి తెలంగాణలో ఉచిత ప్రయాణం వర్తించదు. రాష్ట్ర సరిహద్దు పరిధిలోనే ఉచిత ప్రయాణం ఉంటుంది.

భిన్న అభిప్రాయాలు

ఉచిత ప్రయాణం పట్ల భిన్నభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రానికి చెందిన వాళ్లకే పరిమితి పెడితే ఈ రాష్ట్రంలో స్థిరపడిన ఇతర రాష్ట్రాల వారి పరిస్థితి ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, గజ్వేల్, మెదక్, సిద్దిపేట ప్రాంతాల్లో ఐదారు రాష్ట్రాలకు చెందిన వాళ్లు ఇక్కడ స్థిరపడ్డారు. వీరంతా పారిశ్రామిక వాడల్లో నివాసముంటున్నారు. వీరికి స్థానికంగానే కొందరికి ఓటు హక్కు ఉంది. ఆధార్‌కార్డులు వారి సొంత రాష్ట్రాల అడ్రస్‌తోనే ఉన్నాయి. తెల్లరేషన్ కార్డుల్లేవు. వీరంతా తమ పరిస్థితి ఏమిటీ అంటున్నారు. తెలంగాణ బస్సులు రాష్ట్ర సరిహద్దు దాటితే టికెట్ తీసుకోవాలనే విషయంలో మహిళలు పెదవి విరుస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్ నుంచి బీదర్‌కు తరచూ వెళ్తుంటారు. ఆసుపత్రులు, విద్య, ఇతర అవసరాలు, బంధుత్వాల కోసం వెళ్లే వాళ్లకు తెలంగాణ బస్సులు బీదర్ పోతున్నా ఉచిత ప్రయాణం వర్తించదు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి, మనూరు, నాగిల్‌గిద్ద, కల్హేరు, నిజాంపేట, సిర్గాపూర్ ప్రజలు పక్కనే ఉన్న కర్ణాటకకు చెందిన గ్రామాలకు వెళ్తుంటారు. ఆ రాష్ట్రం వాళ్లతో వ్యాపార, వివాహ సంబంధాలున్నాయి. అక్కడికి పోయి వచ్చే వాళ్లకు ఉచిత ప్రయాణం ఉండదనే విషయంపై మహిళలు నిస్సాయతను వ్యక్తం చేస్తున్నారు. పటాన్‌చెరు ప్రాంతంలో ఉండే ఆంధ్రప్రదేశ్, చత్తీష్‌గడ్, ఇతర రాష్ట్రాలకు చెందిన వాళ్లకు ఇటీవల ఓటు హక్కు ఇచ్చారు. మెదక్ రీజియన్ పరిధిలో వందల గ్రామాలకు బస్సులు నడుస్తలేవు. పల్లెవెలుగు బస్సుల్ని ఊర్లకు తిప్పాలనే డిమాండ్ రానుంది. బస్సుల్లో రద్దీ పెరిగితే మగవాళ్లకు ఇబ్బందులు తప్పవంటున్నారు.

స్పష్టమైన మార్గదర్శకాలు రావాలి

మహాలక్ష్మీ పథకం గురించి స్పష్టమైన మార్గదర్శకాలు రానున్నాయి. సిటీ, ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనే ఉచితమంటున్నారు. ఇతర బస్సులకూ వర్తింపజేయాలా లేదా అనేది తేలాలి. ఏదో ఒక పేరిట స్మార్ట్‌కార్డులు జారీ చేయనున్నారు. ఆ కార్డుల కోసం మహిళలు, థర్డ్‌జెండర్స్ దరఖాస్తు చేసుకోవాలి. రాష్ట్రంలో సుదీర్ఘ కాలం కిందటే స్థిరపడి ఓటు ఉన్న వాళ్లకేమైన అవకాశం కల్పిస్తారా లేదా అనేది చూడాలి. రాష్ట్ర సరిహద్దు వరకు అనుమతిస్తే తిరుపతి, శ్రీశైలం, కనకదుర్గ దేవాలయాలకు వెళ్లే వాళ్లు మొత్తం వర్తింప చేయాలని డిమాండ్ వస్తే ఏం చేయాలని చర్చించనున్నారు. దూరం విషయంలోనూ పరిమితి ఏమైన విధిస్తారా అనేది తేలాలి. ఒక రోజుకు ఇన్ని కిలో మీటర్లు అనే నిబంధన ఏమైనా పెడతారా చూడాలి.

ఆర్టీసీపై పెను భారం

నష్టాల్లో ఉన్న ఆర్టీసీకి ఉచిత ప్రయాణం గుదిబండ కాబోనుందా ? మెదక్ రీజియన్‌లో రోజుకు 2 లక్షలా 9 వేల కిలో మీటర్లు తిరిగే బస్సుల ద్వారా రోజుకు రూ. 86.85 లక్షల ఆదాయం వస్తుంది. కిలో మీటర్‌కు రూ. 43.46 రూపాయల ఆదాయమే వస్తుంది. డీజిల్ ధరలు పెరుగుతున్నాయి. ఒక లీటర్ డీజిల్‌తో 5.61 కిలో మీటర్ల దూరం మాత్రమే ఆర్టీసీ బస్సులు ప్రయాణిస్తున్నాయి. రోజుకు లక్షా 73 వేల మంది ప్రయాణికుల్ని చేరవేస్తున్న మెదక్ రీజియన్‌లో సగం మందికి టికెట్‌లేని ప్రయాణం కల్పిస్తే ఆదాయం కూడా సగానికి పడిపోతుంది. రోజుకు రూ.40 లక్షల ఆదాయం కూడా రాదంటున్నారు. మెదక్ రీజియన్ పరిదిలో 2248 మంది ఉద్యోగులున్నారు. వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గత ప్రభుత్వం గుర్తించింది. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే పద్దతిలో వేతనాలు, ఇతర బెనిఫిట్స్ ఇవ్వట్లేదు. ప్రస్తుతం ఆర్టీసీ నుంచే జీతభత్యాలు చెల్లిస్తున్నారు. ఉద్యోగులకు జీతాలు పెరగడంతో పాటు టీఏ, డీఏలు, ఇతర అలవెన్స్‌లు చెల్లించాల్సి ఉంది. ఇన్ని భారాల్ని భరిస్తూ ఆర్టీసీ ఉచిత ప్రయాణాన్ని కొనసాగించాలంటే ప్రభుత్వం నుంచి రెగ్యులర్‌గా రియంబర్స్‌మెంట్ విధిగా చెల్లించాలని పలువురు ఆర్టీసీ ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

రోజూ తిరుగుతమా?

టికెట్ ఉండదంట మంచిదే. ఇంట్లో మగోళ్లను వదిలి ఆడోళ్లమే ఊర్లు తిరుగుతమా ఏంది. అందరికీ ఉచితం చేయాలి. ఆడోళ్లకే అంటే ఎట్ల ? ఏదో పని ఉంటేనే బస్సెకుతం. పల్లెటూర్లకు బస్సులే వస్తలేవు. ఆట్లో వచ్చి మెయిన్ రోడ్డు కాడ బస్సులెక్కాలి. ఊర్లకు బస్సులు నడిపితే మంచింది.



– శావమ్మ, దాకూరు

మంచి నిర్ణయమే

ఉచిత ప్రయాణం మంచిదే. రేపటి నుంచి అమలు చేస్తరంట. బస్సులో రద్దీ పెరుగుద్ది. అదనంగా బస్సులు నడిపతే మంచింది. దూర ప్రయాణాల గురించి ఆలోచించాలి. పుణ్యక్షేత్రాలకు పోయేటోళ్లకు రాష్ట్ర దాటితే చార్జీలంటున్నారు. అది కూడా ఫ్రీ చేయాలి.



– రుక్మిణి

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అమలు

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఉచిత ప్రయాణం అమలు చేస్తం. ప్రస్తుతం మహిళలు, థర్డ్‌జెండర్‌కు సిటీ, ఆర్డీనరీ, ఎక్స్‌ప్రెస్‌ల్లో ఉచితం వర్తిస్తుంది. ఆధార్, తెల్లరేషన్‌కార్డు ఉంటే సరిపోతుంది. రోజువారి పరిమితి, స్మార్ట్‌కార్డులు, ఇతర అంశాలపై స్పష్టమైన మార్గద ర్శకాలు రానున్నాయి.



– ప్రభులత, ఆర్ఎం, మెదక్ రీజియన్

> కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు ఒక్కొక్కటిగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా మహాలక్ష్మీ పథకానికి శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో 47 జారీ చేసి ఆర్టీసీ అధికారులకు అమలు కోసం పంపింది. శనివారం నుంచి సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో ఆర్టీసీ బస్సుల్లో మహిళలు, లింగ మార్పిడి వ్యక్తులకు ఉచిత ప్రయాణం అమలు కానుంది. పథకం అమలుకు ఎలాంటి నిబంధనలు పాటించాలనే స్పష్టత రాలేదు. ప్రస్తుతం తెలంగాణకు చెందిన మహిళలు, బాలికలు, థర్డ్‌జెండర్స్‌కు సిటీ, ఆర్టినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో తెలంగాణ సరిహద్దుల వరకు ఉచిత ప్రయాణానికి అనుమతిస్తారు. ఆధార్, తెల్లరేషన్‌కార్డు చూపితే సరిపోతుంది. త్వరలోనే స్మార్ట్‌కార్డు జారీ చేసే అవకాశముంది.

ఇళ్ల మధ్య మద్యం దుకాణం ఎత్తేయాలి

- ఇంటి ముందే మద్యం సేవిస్తున్నరు
- వాకిట్లోనే వాంతులు, మూత్ర విసర్జన
- కలెక్టర్‌తో పాటు సచివాలయంలో ఫిర్యాదు చేసిన పట్టిచుకుంటలేరు
- రామాయంపేట బాలాజీనగర్‌వాసుల ఆవేదన



నవతెలంగాణ - రామాయంపేట

ఇళ్ల మధ్య ఉన్న మద్యం దుకాణంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రామాయపేట పట్టణంలోని బాలాజీ నగర్ కాలనీకి చెందిన గడీల భాస్కర్, గంట శోభ, కటికె రతన్‌లాల్, గాట్ల ప్రవీణ్, దేవుని సురేష్, ఎడ్ల సుధాకర్‌రెడ్డి, దేవుని నాగరాజు, కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని మెదక్ రోడ్డులో గల వెంకటేశ్వర వైన్స్ వెనుక భాగంలో ఉన్న కాలనీ వాసులం రెండేళ్లుగా మద్యం దుకాణానికి వచ్చే మందుబాబులతో నానా అవస్థలు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండ్ల ఎదుటే యథేచ్ఛగా మద్యం తాగి, వాకిట్లోనే వాంతులు చేసుకుంటున్నారని, మూత్ర విసర్జన కూడా కానిచ్చేస్తున్నారని వాపోయారు. ఇంట్లో నుంచి మహిళలు బయటకు రావాలంటేనే జంకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గతంలో రామాయంపేట మున్సిపల్ కార్యాలయం, ఎక్సైజ్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. జిల్లా ఎక్సైజ్ కార్యాలయం, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్, రాష్ట్ర మున్సిపల్ శాఖ కార్యాలయం, రాష్ట్ర సచివాలయంలో ఫిర్యాదు చేసినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. రెండేళ్లుగా ఇబ్బంది పడుతున్నామని, నూతన మద్యం దుకాణానికి అనుమతులు ఇవ్వొద్దని నెల రోజులుగా స్థానిక కార్యాలయాల నుంచి రాష్ట్ర కార్యాలయాల వరకు ఫిర్యాదు చేసినా ఎవ్వరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యథేచ్ఛగా అదే స్థలంలో వైన్స్‌కు అనుమతులు ఇచ్చారన్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంకటేశ్వర వైన్స్‌ను ఎత్తివేసి, ఇతర ప్రాంతాలకు తరలించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మండలాన్ని కరీంనగర్‌లో తిరిగి కలపాలి

- ప్రజాదర్బార్‌లో దరఖాస్తు సమర్పించిన మల్లికార్జున్
- నవంబర్ 23న ఎన్నికల ప్రచారంలో సీఎం హామీ



నవతెలంగాణ-బెజ్జంకి

జిల్లాల పునర్విభజనలో బెజ్జంకి మండలాన్ని ప్రజాభిప్రా యానికి వ్యతిరేకంగా నాటి ప్ర జాప్రతినిధులు సిద్దిపేట జిల్లా లో కలిపారని, సిద్దిపేట జిల్లాతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ అన్యాయానికి గురవుతున్నారని, యథావిధిగా తిరిగి మండలాన్ని కరీంనగర్ జిల్లాలో కలపాలని ప్రజాదర్బార్‌లో దరఖాస్తు సమర్పించినట్టు మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆర్టీఐ ప్రచార కమిటీ చైర్మన్ రాసూరి మల్లికార్జున్ తెలిపారు. శుక్రవారం జ్యోతిరావు పూలే ప్రజా భవనంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రి సీతక్కకు మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని మల్లికార్జున్ దరఖాస్తు సమర్పించారు. మండలాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో కలపాలనే అంశంలో పాటు బెజ్జంకి శివారులోని సర్వే నంబర్ 961, 962 లావుని పట్టా ప్రభుత్వ భూమిని అక్రమార్కుల రికార్డుల నుండి తొలగించి ఎస్సీ కార్పొరేషన్ ద్వార కొనుగోలు చేసి పంపిణీ చేసిన లబ్దిదారులకు పట్టా మార్పిడి చేసి అందజేయాలని మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశామని మల్లికార్జున్ తెలిపారు. టీజేవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ర్యాకం రాజు, ఉప్పులేటి శ్రీనివాస్, గాదం మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో సీఎం హామీ

నవంబర్ 2న తిమ్మాపూర్ మండలం రేణికుంట టోల్ గేట్ అవరణం వద్ద మానకొండూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ ఎన్నికల ప్రచార విజయభేరి సభకు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బెజ్జంకి మండలాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో కలుపుతామని హామీనిచ్చారు. కవ్వంపల్లి సత్యనారాయణ ఎమ్మెల్యేగా ఎన్నికవ్వడం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటవ్వడం మండల ప్రజలకు కాస్త ఊరటనిచ్చిన మండలాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో ఎప్పుడు కలుపుతారోనని ఎదురుచూస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని త్వరగా అమలయ్యేలా మండల కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వంద రోజుల్లో ఆరు గ్యారెంటీ స్కీంల అమలు

ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి



నవతెలంగాణ నారాయణఖేడ్‌రూరల్

'కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ప్రజలందరికీ ధన్యవాదాలు. రేపటి నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నాం' అని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా అఖండ విజయం సాధించిన పట్లోళ్ల సంజీవరెడ్డి శుక్రవారం తన తండ్రి పట్లోళ్ల కిష్టారెడ్డికి నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం సాధించిన తర్వాత అభివృద్ధి చేస్తామని గత ప్రభుత్వం చెప్పిందని, ప్రజలు ఆశించిన స్థాయిలో ఎక్కడా అభివృద్ధి చేయలేదని తెలిపారు. సోనియా గాంధీ ఆరు గ్యారెంటీ స్కీములను దశల వారీగా అమలు చేస్తామన్నారు. రోడ్లు, తాగునీటిపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారిస్తుందన్నారు. నిరుద్యోగుల సమస్య త్వరలో పరిష్కరిస్తామన్నారు. గత ప్రభుత్వాలు ప్రొసీడింగ్లు ఇచ్చారు.. పనులు చేయలేదని అన్నారు. పేదవారికి విద్య అందని ద్రాక్షలా మారిందన్నారు విద్యా రంగాన్ని మెరుగుపరుస్తామన్నారు. వైద్యరంగంలో 108 సర్వీసు లేకుండా పోయిందన్నారు. గతంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి 108 సర్వీస్ను మొదలు పెట్టారని, టీఆర్ఎస్ ప్రభుత్వం 108 సర్వీస్ లేకుండా చేసిందన్నారు. కెసిఆర్ కిట్టు ఇస్తున్నామని టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. ఎక్కడ అమలు చేయలేదన్నారు. మెడికల్ కాలేజీలో టీచింగ్ స్టాఫ్ నాన్ టీచింగ్ స్టాఫ్ ఇతర సిబ్బంది పోస్టులు భర్తీ చేయలేదన్నారు బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఎక్కడ కూడా కాల్వలు తీయలేదన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటలు కరెంటు ఇస్తున్నామని పెండింగ్ బిల్లులు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రివ్యూ మీటింగ్ పెట్టారన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఇచ్చిన మాట తప్పకుండా అమలు చేస్తామన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఇచ్చినట్లుగా కార్పొరేట్ వైద్యం 10 లక్షల కార్పొరేట్ వైద్యం అందిస్తామన్నారు. టీఆర్ఎస్ పాలనలో సమ్మె చేసిన వారిపై నిర్బంధం ప్రయోగించిందన్నారు. అంగన్వాడీలు, ఆశ వర్కర్లు ఇతర యూనియన్లు సమ్మె చేస్తే అణచివేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యయుత్తంగా శాంతియుతంగా వారందరి సమస్యలు పరిష్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి రమేష్ చౌహన్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కోలుకోవాలని ప్రత్యేక ప్రార్థనలు



నవ తెలంగాణ-సిద్దిపేట

కేసీఆర్ త్వరగా కోలుకోవాలని సిద్దిపేట ఈద్గా మైదానంలోని జానుల్లా షా దర్గాలో ప్రార్థించామని మైనార్టీ నాయకులు బబ్లూని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదాబ్ మోయిజ్, ఆసిఫ్ తవకల్, షౌకత్, చంద్, అజీజ్, బాబా, తౌహిసిన్, ఫరీద్, రియాజ్, అజహర్, షకీర్ తదితరులు పాల్గొన్నారు.

కొడకంచిలో డ్రగ్ యూనిట్‌పై పోలీసుల దాడులు

- 14 కిలోల నార్కో టికెట్ డ్రగ్ నార్థా జపం స్వాధీనం
- ఐదుగురి అరెస్ట్
- జిన్నారం పోలీసులను అభినందించిన ఎస్పీ రూపేష్





నవతెలంగాణ జిన్నారం

గుట్టు చప్పుడు కాకుండా మత్తుమందులను తయారుచేసి సులువుగా డబ్బులు సంపాదించాలనే కోణంలో టీంగా ఏర్పడి నిర్వహిస్తున్న డ్రగ్ తయారీ కేంద్రంపై దాడులు చేసి తెలంగాణ స్టేట్ ఇలాంటి నార్కోటిక్ డ్రగ్ సెల్ అధికారులు, స్థానిక పోలీసులు డ్రగ్స్ స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపారు. జిన్నారం పోలీస్‌స్టేషన్లో శుక్రవారం వివరాలను వెల్లడించారు. 'జిన్నారం మండలం కొడకంచి గ్రామ శివారును కేంద్రంగా చేసుకొని నాలుగు నెలల కిందట సర్వేనెంబర్ 272,273లలో లింగాల సుమనకు చెందిన మూడు ఎకరాల 30 గుంటల భూమిని హత్నూర మండలం బోరుపట్ల గ్రామానికి చెందిన మహ్మద్ యూనస్ అలియాస్ జక్కరాజు, గుండ్ల మాచునూరు గ్రామానికి చెందిన గౌండ్ల శ్రీనివాస్ గౌడ్, జిన్నారం మండలం కొడకంచి గ్రామానికి చెందిన కిష్టంగారి నిర్మల్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లకు చెందిన పసుపులేటి మాణిక్యాలరావు, కొడకంచి గ్రామానికి చెందిన కృష్ణగారి శివశంకర్ గౌడ్, బీరంగూడకు చెందిన రాహుల్ రెడ్డి గుండ్లమాచిన్నూర్‌కు చెందిన శ్రీశైలం యాదవులు లీజుకు తీసుకున్నారు. వీరంతా ఓ బృందంగా ఏర్పడి జిన్నారం మండలం కొడకంచి శివారులో డ్రగ్ తయారీ కేంద్రాన్ని గుట్టు చప్పుడు కాకుండా నడుపుతున్నారు. ఆ భూములో కెమికల్ ల్యాబ్ స్థాపించి నార్థజపం సబ్ స్టాండ్స్ నార్కోటిక్ డ్రగ్ తయారు చేయడం ప్రారంభించారు. ఏంటి నార్కోటిక్ డ్రగ్ సెల్ సమాచారం మేరకు ఆ కేంద్రంపై పోలీసులు దాడులు చేశారు. 14 కిలోల నార్కోటిక్ డ్రజపం, దాదాపు రూ.70 లక్షలు విలువైన సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ మార్కెట్లో దాదాపు రూ.మూడు కోట్ల వరకు ఈ డ్రగ్స్ విలువ ఉంటుందని అంచనా. మమ్మద్ యూనిస్ అనే అతను గతంలో శ్రీనివాస్ గౌడ్, షకీల్, బ్రహ్మ గౌడ్, హరినాథ్ రెడ్డి ఎల్ల బృందంతో కలిసి నర్సాపూర్ మండలం రాజుపల్లి గ్రామంలో ఆల్ఫా జోన్ డ్రగ్ తయారీ కేసులో 2017 సంవత్సరంలో డీఆర్ఐ హైదరాబాద్ వారు కేసు నమోదు చేశారు. అతను మూడు సంవత్సరాల జైలు జీవతం కూడా అనుభించాడు. గతంలో ఇతను సర్వేన అనే కెమికల్ కంపెనీలో పని చేసే సమయంలో మాణిక్యాలరావు, శ్రీనివాస్‌గౌడ్‌లు పరిచయమయ్యారు. గౌండ్ల శ్రీనివాస్‌గౌడ్‌కు కొడకంచికి చెందిన శివ శంకర్ గౌడ్ పరిచయం కావడంతో తాను తీసుకున్న లీజు భూమిలో జామ తోట కలదని శివారులో ఇప్పించి కెమికల్ ప్లాంట్ పెట్టడానికి సహాయం చేశాడు. అతని వాటర్ ప్లాంట్‌లో పనిచేసే కిష్టంగారి నిర్మల్ గౌడ్లు వారి బైకులపై సామగ్రిని తరలించే వారు. పసుపులేటి మాణిక్యాలరావు గతంలో కూడా బాలానగర్ ఏరియాలో షాపూర్‌నగర్‌కు చెందిన కోటిరెడ్డి వెంకటేశ్వరరావుతో కలిసి ఆల్ఫా జోన్ తయారు చేస్తూ ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడి ఆరు నెలలు జైల్లో ఉన్నాడు. కొడకంచి శివారులో డ్రగ్ తయారీని నిర్వహిస్తూ గుట్టు చప్పుడు కాకుండా ఓ కెమికల్ ల్యాబ్ ఏర్పాటు చేసుకుని సైకో ట్రాఫిక్ సబ్స్టాన్స్ అయినా నార్థా జపం అనే నార్కోటిక్ తయారీ ద్వారా సులువుగా డబ్బులు సంపాదించేందుకు పథకం వేశారు' అని చెప్పారు. ఈ బృందంలో మమ్మద్ యూనస్ మాణిక్యాలరావు గౌండ్ల శ్రీనివాస్ కృష్ణ గారి నిర్మల్ గౌడ్ కృష్ణ గారి శివశంకర్ గౌడ్ లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో రాహుల్‌రెడ్డి, శ్రీశైలం, యాదవులు పరారీలో ఉన్నట్లు చెప్పారు. హైదరాబాద్ నగరానికి చేరువులోనే గల జిన్నారం మండలం కొడకంచి శివారులో గుట్టు చప్పుడు కాకుండా మత్తుమందులను తయారు చేస్తున్న కేంద్రంపై యాంటీ నార్కోటిక్స్ నార్కోటిక్స్, జిన్నారం పోలీసుల బృందం డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, జిన్నారం సీఐ వేణు కుమార్, జిన్నారం ఎస్సై విజయ రావు, ఏంటి నార్కోటిక్ బ్రిక్స్ డిఎస్పి శ్రీధర్, సిఐ రమేష్ బృందాలు దాడులు చేసి సామగ్రిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న పోలీసులను ఎస్పీ అభినందించారు.

అమ్మో చలి

- మెతుకుసీమను కమ్మేసిన మంచు
- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు



నవతెలంగాణ - మెదక్

శీతాకాలం వచ్చిందంటే ప్రతి ఒక్కరూ అమ్మో చలి అని వణికిపోవాల్సిందే. ఓ వైపు చలి పంజా విసురుతుంటే మరో వైపు వ్యాధులు ప్రబలుతుంటాయి. దీంతో పసి పిల్లల నుంచి పండుముసలి వరకు చలి తీవ్రతను తట్టుకోలేక సతమతమవుతుంటారు. రోజురోజుకు పడిపోతున్న ఉష్ణోగ్రతలతో వాతావరణంలో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. తెల్లవారుజామున పొగమంచు కప్పేస్తుండగా, చీకటి పడితే చాలు చలి తీవ్రత ఎక్కువై వణికిస్తోంది. జలుబు, దగ్గు. నిమ్మోనియా, ఆస్తమా వంటి శ్వాసకోశవ్యాధులు, చర్మ సంబంధిత వ్యాధులతో పాటు డెంగ్యూ, డయోరియా, చికెన్ గున్యా వంటి విషజ్వరాలు ప్రజలకు సంక్రమించే పరిస్థితి ఉంటుంది. వారం రోజుల నుంచి చలి తీవ్రత అధికమవడంతో ప్రజలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఈ క్రమంలో చలితీవ్రత నుండి తట్టుకునేందుకు ప్రతి ఒక్కరు రక్షణ చర్యలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

- చలికాంలో సంక్రమించే రోగాల పట్ల ప్రజలు తప్పనిసరిగా తగు జాగ్రత్తలను పాటించాలి.
- తెల్లవారుజామునే వివిధ పనుల నిమిత్తం భయటకు వెళ్లే వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు, చిన్నపిల్లలు, వృద్దులు చలీతీవ్రతను తట్టుకునేందుకు అప్రమత్తంగా ఉండాలి.
- దగ్గు, జలుబు, గొంతునొప్పి, కీళ్లనొప్పులు, జ్వరం వంటి సీజనల్ వ్యాదులు సంక్రమించే అవకాశాలు ఉన్నాయి.
- వాతావరణంలో ఏర్పడిన మార్పుల వల్ల పీల్చే గాలిలో గాడైన వాసనలు, పొగ, దుమ్ము, దూలితో పాటు పలు సూక్ష్మజీవులు శరీరంలోని ఊపిరితిత్తులకు చేరడం వలన శ్వాస సంబంధిత వ్యాధులు సంక్రమిస్తాయి.
- చలితో చిన్నారులు, వృద్దులు అనారోగ్యం బారిన పడే అవకాశాలున్నాయి. ముఖ్యంగా నిమ్మోనియా, వైరల్ ఇన్ఫెక్షన్లు, డెంగ్యూ, చికెన్గున్యా వంటి విషజ్వరాలు సోకే అవకాశాలు ఎక్కువ ఉంటాయి.
- ఉష్ణోగ్రత తగ్గడంతో చల్లదనానికి దోమలు పెరగడం వల్ల రోగాలు వ్యాప్తి చెందుతాయి.
- చలి కాలంలో రోగ నిరోదకశక్తి తక్కువగా ఉన్నవారు నిల్వ ఉన్న ఆహారపదార్థాలను తినడం వల్ల డయోరియా, అస్తమా, జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాదులు సంక్రమించే అవకాశం ఉంటుంది.

వేధిస్తున్న జలుబు, దగ్గు

- చలికాలంలో ఎక్కువగా జలుబు, దగ్గు బాదపెడుతుంటాయి. శరీరానికి ఎలాంటి రక్షణ లేకుండా చలిలో బయట తిరగడం, చల్లటి నీటితో స్నానం చేయడం, కూల్డ్రింక్స్, చల్లటి నీరు తాగడం వల్ల దగ్గు, జలుబు సంక్రమిస్తాయి.
- దగ్గు పలు రకాలుగా ఉంటుంది. ఇందులో పొడి దగ్గు, కఫంతో కూడిన దగ్గు ఎక్కువగా వస్తుంది.
- చిన్న పిల్లల పై చలితీవ్రత ఎక్కువగా ఉంటుంది. పిల్లలకు జలుబు, దగ్గుతో నిమ్మోనియా వచ్చే అవకాశాలు ఉంటాయి. దీంతో పిల్లలకు శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది.

ఆస్తమాతో అప్రమత్తంగా ఉండాలి

ఆస్తమాతో భాదపడుతున్న వ్యాదిగ్రస్తులకు శీతాకాలం కష్టకాలమనే చెప్పాలి. చలితీవ్రత ఎక్కువైన కొద్ది ఎన్నో ఇబ్బందులతో సతమతమవుతారు. వాతావరణంతో ఒక్కసారిగా వచ్చిన మార్పులతో చలి తీవ్రత పెరుగుతుంది. దీంతో ఈ వ్యాధి గ్రస్తులకు ముక్కు ద్వారా ఊపిరి తీసుకోవడం ఎంతో కష్టంగా మారుతుంది. ఎక్కువగా నోటి ద్వారా ఊపిరిని తీసుకుంటూ కష్టపడుతుంటారు. అలా చేయడం వల్ల ఊపిరితిత్తులకు పూర్తిస్థాయిలో గాలి అందకపోవడంతో ఆయాసం ఎక్కువ అవుతుంది. ఈ వ్యాధి ఎక్కువగా అయితే నిమ్మోనియా వచ్చే అవకాశాలు ఉంటాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఆస్తమా వ్యాదిగ్రస్తులు చలి కాలంలో ఎక్కువగా భయట తిరుగకూడదు.
- శరీరాన్ని పూర్తిగా కప్పేలా స్వెట్టర్లు, టోపీలు ధరించాలి.
- వైద్యుల సూచనల మేరకు మందులను వాడాలి.
- ఆస్తమాతో భాదపడుతున్న వారికి నెబ్లైజేషన్, ఆక్సిజన్లను పెట్టడం ద్వారా ఆయాసం నుండి కాస్త ఉపశమనం పొందుతారు.
- రాత్రి పడుకునే సమయంలో ఊపిరితిత్తులకు శ్వాస అందే విధంగా చూసుకోవాలి. చలి నీటితో కాకుండా గోరువెచ్చటి నీటితో స్నానం చేయాలి. వేడి చేసి చల్లార్చి నీటిని తాగాలి.

చర్మ వ్యాధుల పట్ల జాగ్రత వహించాలి

చలికాలంలో శ్వాసకోశ వ్యాదులతో పాటు చర్మ సంభంద వ్యాదులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. చర్మంలో తేమ తగ్గి పొడిబారి పోతాయి. వాతావరణంలో ఏర్పడిన మార్పుల వల్ల మెడ పైన ఎర్రగా కావడం, శరీరం పై దురద, మంటలు రావడం జరుగుతుంది. చర్మం పూర్తిగా పొడిబారుతుంది. వయస్సు పై బడే కొద్ది సైతం దురద పెరుగుతుంది. దీంతో అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది.

నివారణ చర్యలు

- చలిలో భయట తిరుగకూడదు. చల్లటి నీటితో కాకుండా గోరు వెచ్చటి నీటితో స్నానం చేయాలి.
- శరీరాన్ని పూర్తిగా కప్పి ఉండే విధంగా ఉలన్తో తయారు చేసిన దుస్తులను ధరించాలి. స్వెట్టర్లు, తలకు టోపీలు తప్పకుండా పెట్టుకోవాలి.
- పిల్లలకు జలుబు, దగ్గు సోకకుండా ఉండేదుకు తల్లిదండ్రులు పిల్లల చేతులను శుభ్రంగా కడగాలి.
- పిల్లలకు సమయానికి తినిపించి, పడుకోవడం వంటివి నేర్పించాలి. జలుబు, దగ్గు సోకిన పిల్లలకు దూరంగా ఉండాలి.
- దగ్గుతున్నప్పుడు పక్కన వారికి వైరస్ సోకకుండా ఉండేందుకు చేతిని అడ్డంగా పెట్టుకోవాలి.
- చలి కాలంలో నీరు ఎక్కువగా తాగాలనిపించదు. దీంతో శరీరం డీహైడ్రేషన్కు గురయ్యో అవకాశం ఉంటుంది. కాబట్టి వీలైనంత వరకు నీరు ఎక్కువగా తాగేందుకు ప్రయత్నించాలి.
- శరీరాన్ని శుభ్రం చేసేందుకు వాడే సబ్బులను తగ్గించాలి. గాఢత ఉన్న వాటిని కాకుండా తక్కువ ఉన్న సబ్బులను వాడాలి.
- పడుకునే ముందు చర్మం పై మాయిష్టరైజర్ కోల్డ్ క్రీములను పెట్టుకోవాలి.
- చలి ఎక్కువగా ఉన్న సమయంలో భయట పనులు తగ్గించుకోవాలి. అధికంగా ఆహారం తీసుకోకూడదు.
- నువ్వుల నూనె, బాడీ లోషన్లు శరీరానికి మర్ధన చేయాలి. గోరువెచ్చటి నీటితో స్నానం చేయాలి. కూల్డ్రింక్స్, ఫాస్టుఫుడ్ వంటివి తగ్గించాలి.
- చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు వాహనదారులు తలకు హెల్మెట్, మాస్కులను ధరించాలి.

పండ్లతో రోగనిరోధక శక్తి

పండ్లను ఆహారంగా తీసుకోవడం వల్ల రోగనిరోదక శక్తి పెరుగుతుంది. విటమిన్ సి ఉన్న ఉసిరి, బత్తాయి, నిమ్మ, దానిమ్మ వంటి పండ్లను ఎక్కువగా తీసుకోవాలి. ఆకుకూరలు, ఉసిరికాయలు, బొప్పాయి, అనస, ఖర్జూర వంటి అన్ని రకాల సీజనల్ పండ్లతో పాటు ఇతర పండ్లను తీసుకోవచ్చు. పండ్లను తీసుకోవడం వల్ల ప్రోటీన్స్, మినరల్స్ ఎక్కువగా లభించి ఆరోగ్యంగా ఉండవచ్చు. విటమిన్ సీ ఉన్న పండ్లను తీసుకుంటే చర్మం పొడిగా ఉంటుంది.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



జిల్లాలో చలితీవ్రత ఎక్కువవుతుంది. శీతాకాలంలో అధికంగా సీజనల్ వ్యాదులు విజృంభిస్తుంటాయి. పసిపిల్లలు, గర్బిణులు, వృద్దులు, బీపీ, షుగర్ పేషెంట్లకు రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటం వల్ల త్వరగా వ్యాధులు సంక్రమిస్తుంటాయి. వాతావరణంలో చలి తీవ్రతతో శ్వాసకోశవ్యాదులు, జలుబు, దగ్గు, జ్వరం, నిమ్మోనియా, ఆస్తమా, ఆయాసం వంటి పలు రకాల రోగాలు సంక్రమిస్తుంటాయి. చల్లటి గాలులు వీయడంతో దుమ్ము దూళి వల్ల ఊపిరితిత్తులలో ఇన్ఫెక్షన్ వచ్చి నిమ్ముతో ఇబ్బందులు పడుతుంటారు. చలి ఎక్కువగా ఉన్న సమయంలో స్వెట్టర్లు, మఫ్లర్లు, చేతులకు బ్లౌజ్లను ధరించాలి. వాహనాలు నడిపించే వారు చేతులకు క్లౌజు, స్వెట్టర్లు ధరించాలి. పొలాలకు వెళ్లే రైతులు వెచ్చటి దుస్తులను కప్పుకొని వెళ్లాలి.

– డాక్టర్ పి. చంద్రశేఖర్, సూపరెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి, మెదక్

సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు



నవతెలంగాణ-చేర్యాల

అంగన్వాడీ టీచర్లు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని సీడీపీఓ శారద హెచ్చరించారు. చేర్యాల పట్టణ కేంద్రంలోని పలు అంగన్వాడి కేంద్రాలను శుక్రవారం సీడీపీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణ కేంద్రంలోని ఎనిమిదవ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి అంగన్వాడీ టీచర్, ఆయాకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం ప్రతి బాలింత, గర్భిణీలకు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రం వద్ద కేంద్రాన్ని తెలియజేసే సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని టీచర్లను ఆదేశించారు. అంగన్వాడి కేంద్రం అద్దె భవనం కావడంతో మౌలిక వసతులు లేవని అంగన్వాడి టీచర్ బాలమణి సీడీపీఓ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు.

జహీరాబాద్ వరకు ఎలక్ట్రిక్ ట్రైన్ నడపాలి

డీఆర్‌యూసీ మెంబర్ షేక్ ఫరీద్



నవతెలంగాణ-జహీరాబాద్

లింగంపల్లి నుంచి కోహిర్, జహీరాబాద్ మీదుగా బీదర్ వరకు ఎలక్ట్రిక్ ట్రైన్ నడపాలని డీఆర్‌యూసీ మెంబర్ షేక్ ఫరీద్ డిమాండ్ చేశారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని రైల్వే భవన్‌లో ఏర్పాటు చేసిన డీఆర్‌యూసీ సభ్యుల సమావేశానికి హాజరై ఎంపీ బీబీ పాటిల్ ఇదివరకే ఈ విషయమై కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇచ్చినట్లు తెలిపారు. రైల్వే స్టేషన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి కోహిర్ పట్టణానికి వెళ్లేందుకు ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలని సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారని అన్నారు.

చెరుకు ఫ్యాక్టరీ కార్మికులకు, రైతులకు బకాయిలు వెంటనే చెల్లించాలి

మాజీ మంత్రి డాక్టర్ ఏ చంద్రశేఖర్



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ షుగర్ ఫ్యాక్టరీని నడిపించేందుకు కృషి చేస్తామని మాజీ మంత్రి డాక్టర్ ఏ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం షుగర్ ఫ్యాక్టరీని సందర్శించి కార్మికులతో మాట్లాడారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడి బాకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు రాముల యాదవ్, పార్టీ మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-సదాశివపేట

సంగారెడ్డి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా రెండోసారి గెలుపొందిన చింతా ప్రభాకర్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం సదాశివపేట మండలంలోని పొట్టిపల్లి గ్రామ సర్పంచ్ అశోక్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, చింత ప్రభాకర్‌ను కలిసి పుష్పగుచ్చాలు అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పొట్టి పల్లి గ్రామ సర్పంచ్ అశోక్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మహేంద్ర నాథ్, గ్రామపంచాయతీ కోఆప్షన్ మెంబర్ ఉదయ భాస్కర్, మరియు తదితర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలనీల్లో రోడ్లు నిర్మించాలి



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని వివిధ కాలనీలో మాజీ మంత్రి డాక్టర్ ఏ.చంద్రశేఖర్ శుక్రవారం పర్యటించారు. కాలనీల్లో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను వెంటనే నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావును కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ డి ఈ డిప్పున్, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



నవతెలంగాణ-పటాన్ చెరు

పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి మూడోసారి శాసనసభకు ఎన్నికైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

విద్యార్థులకు టై, బెల్టుల వితరణ



నవతెలంగాణ-కొమురవెల్లి

మండలంలోని మరిముస్త్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ టీచర్ పాసికంటి జనార్దన్ టై, బెల్టులను వితరణ చేశారు. వాటిని విద్యార్థులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. కాగా ఆయనకు విద్యార్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, ఉపాధ్యాయులు అంజయ్య, భూపతిరెడ్డి ప్రమోదిని, చింతల కనకయ్య, విజయలక్ష్మి, శారదా పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు



నవతెలంగాణ-తొగుట

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సిలి వేరి మల్లారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బక్క కనకయ్యలు శుభాకాంక్షలు తెలిపారు. జప్తి లింగారెడ్డి పల్లి గ్రామస్థులతో కలిసి ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డిని పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ప్రభాకర్ రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ప్రత్యర్థులపై 53 వేల ఓట్ల పైచిలుకు మెజార్టీ సాధించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సురేష్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెచ్చని నేస్తాలు ఉన్ని దుస్తులు

- అందుబాటులో దుస్తులు
- జోగిపేటలో కొనుగోళ్ల జోరు
- చలికి ఎంతో మేలు



నవతెలంగాణ-జోగిపేట

చలికాలం ప్రారంభమైంది. ప్రతి ఒక్కరూ చలికి వణికి పోతున్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా ఉదయం నుంచి సాయంత్రం, రాత్రి వరకు దుప్పట్లో దూరి పోతుంటారు. ఉదయం పూట చలికి తొందరగా లేచే పరిస్థితులు ఉండవు. ప్రస్తుతం వాతావరణం 24 డిగ్రీలు నమోదవుతోంది. చలిపులికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చిన్నారులు పాఠశాలలకు స్వెటర్లు వేసుకుని వెళ్తున్నారు. తమ ఆఫీసులకు కూడా స్వెటర్లు ధరించి వెళ్తున్నారు. చలి నుంచి శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవడానికి ఉన్ని దుస్తులు ధరిస్తుంటారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చి మన ప్రాంతంలో చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకొని దుస్తులను విక్రయిస్తున్నారు. విభిన్న రంగుల్లో, సరసమైన ధరకు అందుబాటులో స్వెటర్లు, మంకీ క్యాపులు, లేడీ స్ స్వెటర్లు, రగ్గులు, బ్లాంకెట్లు, ఉలన్ చద్దంజీలు, జర్కిన్లు అందుబాటులో ఉంచుతున్నారు. యువతీ యువకుల కోసం ప్రత్యేకంగా చాలా రకాల దుస్తులు ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్నాయి. జోగిపేటతో పాటు ఆయా మండలాల్లో రోడ్ల పక్కన ఉన్ని దుస్తుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పక్క రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, నేపాల్‌తో పాటు హైదరాబాద్ ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి దుస్తులను విక్రయిస్తున్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా ఇక్కడికి వచ్చి ఉన్ని దుస్తులను విక్రయిస్తున్నారు. నవంబర్, డిసెంబర్, జనవరి మాసాలలో ఈ క్రయ విక్రయాలు జరుగుతాయి. రోడ్ల పక్కన చిన్న చిన్న షెడ్లు వేసుకొని చేతితో అల్లిన దుస్తులను విక్రయిస్తుంటారు. స్థానికంగా రెడీమేడ్ దుకాణాల్లో కూడా ఉన్ని దుస్తులను హైదరాబాదు నుంచి తెచ్చి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం ధరలు కూడా సామాన్యులకు అందుబాటులో ఉంటున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో స్వెటర్ ధరలు ఆడ, మగవారిని రూ.450, మంకీ క్యాపులు రూ.50 నుంచి రూ.100, జర్కిన్లు రూ.900, మఫ్లార్లు రూ.50 నుంచి రూ.100, హ్యాండ్ గ్లౌజులు రూ.80 నుంచి రూ.100, లేడీస్ స్వెటర్లు రూ.450, బ్లాంకెట్‌లు రూ.500, చిత్రంజీలు రూ.200 నుంచి రూ.300 వరకు ధరలు పలుకుతున్నాయి. కొరియా దుప్పట్లు రూ.500, సోలాపూర్ దుప్పట్లు రూ.400, లైట్ వెయిట్ దుప్పట్లు రూ.150, టైగర్ బ్లాంకెట్లు రూ.500, మారుతి దుప్పట్లు రూ.500 లతో పాటు ఆకర్షణీయమైన దుప్పట్లు అందుబాటులో ఉన్నాయి.

సరసమైన ధరలకు విక్రయిస్తున్నాం



సరసమైన ధరలకు ఉన్ని దుస్తులను అందుబాటులో ఉంచాం. ప్రతి సంవత్సరం లాగే ఈ ప్రాంతానికి వచ్చి దుస్తులను విక్రయిస్తున్నాం. రెండు నెలలపాటు విక్రయాలు జరుపుతున్నాం. ఇప్పుడిప్పుడే గిరాకి వస్తోంది.

– కరణ్ మీనా, వ్యాపారి, మధ్యప్రదేశ్

ఉన్ని దుస్తులు తప్పనిసరి



చలికాలంలో ఉన్ని దుస్తులు తప్పనిసరి వాడాల్సిందే. శరీరం వెచ్చగా ఉండాలంటే ఉన్ని దుస్తులు వేసుకోక తప్పదు. ప్రతి సంవత్సరం కొనుగోలు చేస్తాం. సరసమైన ధరలకు అందుబాటులో వస్తున్నాయి.

– రవి, జోగిపేట

గీతంను సందర్శించిన కేవీ విద్యార్థులు



నవతెలంగాణ-పటాన్‌చెరు

గచ్చిబౌలిలోని కేంద్రీయ విద్యాలయ 11, 12వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని సందర్శించారు. ఉదారవాద విద్య (లిబరల్ ఎడ్యుకేషన్), కార్యాచరణ ఆధారిత అభ్యాసం (యాక్టివిటీ-బేస్డ్ లెర్నింగ్), అనుభవ అభ్యాసం (హ్యాండ్స్-ఆన్ ఎక్స్ పీరియన్స్) పై విద్యార్థులకు సమగ్ర అవగాహనను అందించడం లక్ష్యంగా ఈ సందర్శనను ఏర్పాటు చేశారు. గీతమ్‌లోని హ్యుమానిటీస్, మేనేజ్మెంట్, ఫార్మసీ విభాగాల అధ్యాపకులు కేవీ విద్యార్థులకు వర్క్ షాప్, చర్చాగోష్ఠులను నిర్వహించారు. ఆ విద్యార్థులకు గీతం సమగ్ర విధానాన్ని పరిచయం చేయడంతో పాటు అనేరకాల సహ-పాఠ్యాంశాలు, పాఠ్యేతర కార్యకలాపాలను పరిచయం చేశారు. పరిశ్రమలోని ఉన్నత స్థాయి అధికారులతో తరచుగా ముఖాముఖి నిర్వహించి విద్యార్థుల సంపూర్ణ పరిణతికి బాటలు వేస్తున్న తీరును గీతం అధ్యాపకులు వివరించారు. విద్యా సంస్థ సామాజిక బాధ్యత (ఐఎస్ఆర్)లో భాగంగా, ఇంటర్మీడియెట్ లేదా ౦2 విద్యార్థులు, అధ్యాపకుల కోసం వర్క్ షాప్, అధ్యాపక వికాస కార్యక్రమాలు, చర్చాగోష్ఠులను గీతం నిర్వహిస్తోంది. వివిధ అంశాలపై వారి నైపుణ్యాలు, పరిజ్ఞానాన్ని మెరుగుపరచడం, వారి వ్యక్తిగత జీవితంలో వాటిని అమలు చేయడంపై ఆచరణాత్మక అంతర్దృష్టులను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది.గీతం, హై దరాబాద్ ప్రాంగణాన్ని సందర్శించడం కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు సుసంపన్నమైన అనుభవం ఇవ్వడమే గాక, గీతం అధ్యాపకులతో నేరుగా సంభాషించే అవకాశాన్ని కలిగించింది. విశ్వవిద్యాలయ బోధన విధానంపై అవగాహన కల్పించారు.

సర్వసభ్య సమావేశంలో సమస్యల వెల్లువ

- పలు సమస్యలపై అధికారుల నిలదీత
- - రెండు గంటల ఆలస్యంగా కొనసాగిన సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-పుల్కల్

మండల సమావేశ మందిరంలో శుక్రవారం నాడు నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో పలురకాల సమస్యలతో ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు అంతేకాకుండా 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభించారు. సమావేశానికి వచ్చిన ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు అధికారులపై మండిపడ్డారు చివరకు మండల అధ్యక్షురాలు చైతన్య విజయ భాస్కర్‌రెడ్డి హాజరై సభకు ఆలస్యంగా రావడంపై సభ్యులందరికీ క్షమాపణ కోరారు. చౌటకూర్ మండలం కోర్పోల్ గ్రామ ఎంపీటీసీ కళాలి వీర గౌడ్ అలాగే పుల్కల్ మండలం మిన్పూర్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ దుర్గయ్య పలు శాఖల అధికారులపై మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించలేని సమావేశాలు ఎందుకు నిర్వహిస్తారని ప్రశ్నించారు. దీంతో ఎంపీడీవో విజయలక్ష్మి కలుగజేసుకొని ఏ గ్రామంలో ఏ సమస్యలున్నా వాటిని త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామని హామీ ఇవ్వడంతో సభ్యులు శాంతించారు. ప్రజాప్రతినిధులు మొండికేసి ఆయా గ్రామాల్లో అర్ధాంతరంగా ఆగిపోయిన పనులను వెంటనే పూర్తి అయ్యేలా చూడాలన్నారు అంతేకాకుండా గ్రామాల్లో మిషన్ భగీరథ పనులు ప్రారంభించి ఐదు సంవత్సరాలు గడిచినప్పటికీ నేటికీ అవి పూర్తి కాకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పలు గ్రామాలలో అంగన్వాడి టీచర్ పోస్టులు ఖాళీగా ఉండడంతో అట్టి స్థానంలో నూతన టీచర్లను నియమించడంలో ఐసీడీఎస్ అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్ల అన్యం పుణ్యం ఎరుగని చిన్నారులు చదువుకు దూరం అవుతున్నారన్నారు. సింగూరు ప్రధాన రహదారి కి మిన్పూర్ గ్రామ శివారులో పెద్ద పెద్ద గుంతలు పడడంతో అట్టి రోడ్డుపై వెళ్లాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి మండలంలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలను పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో విజయలక్ష్మి మండల అధ్యక్షురాలు చైతన్య విజయభాస్కర్ రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో సభను ముగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి పంచాయతీరాజ్ ఏ ఈ .శశి కుమార్ ఏవో .చైతన్య ఐకెపి ఏ పి ఎం .శివలక్ష్మి ఆర్ ఐ మాధవరెడ్డి వివిధ శాఖల అధికారులు ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు సిబ్బంది పాల్గొన్నారు



రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

రైతుల సంక్షేమం కోసం పనిచేసేది కాంగ్రెస్ ప్రభుత్వమని మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలోని వైఎస్ఆర్ మార్కెట్ కార్యాలయంలో రైతుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో రైతులకు సరైన గిట్టుబాటు ధరలు, కొనుగోలు కేంద్రాలు లేక దళారులను ఆశ్రయించారన్నారు. రైతుల సంక్షేమం కోసం 24 గంటలు ఉచిత విద్యుత్ సకాలంలో అందించాలన్నారు. ఎరువులు, విత్తనాలు, రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని ఆయన అధికారులను కోరారు. మీజన్ తుఫాన్ వల్ల తడిసిన వడ్లను కొనుగోలు చేయాలన్నారు. పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు. రైతుల సంక్షేమం కోసం పనిచేసే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రంగారెడ్డి, నాయిని యాదగిరి, ముత్యాలు గొల్లపల్లి నరేందర్ రెడ్డి, మొనగారి రాజు రెడ్డి, నక్క రాములు గౌడ్, గుండనపల్లి సత్యనారాయణ, గుండు లక్ష్మణ్, నేత నాగరాజు మైనార్టీ నాయకులు అజ్గర్ యూత్ కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్ రెడ్డి, టిల్లురెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువులకు సాగునీటి సౌకర్యం కల్పించాలి

పీఏసీఎస్ చైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

గ్రామానికి సాగునీటి అందేలా కృషి చేయాలని కాన్గల్ పీఏసీఎస్ చైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణ రెడ్డి కోరారు. శుక్రవారం దుబ్బాక ఎమ్మెల్యేగా గెలుపొందిన కొత్త ప్రభాకర్ రెడ్డిని మండలంలోని గుడికందుల గ్రామానికి చెందిన నాయకులు, కార్య కర్తలతో కలిసి శుక్రవారం మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హరికృష్ణ రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి చెందిన రెండు చెరువులకు సాగునీటి సౌకర్యం కల్పించాలని కోరామని తెలిపారు. చెరువులకు సాగునీరు అందిస్తే రైతాంగానికి వరి పంట సాగు చేసేందుకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. నీటి సౌకర్యం కోసం ఏర్పాట్లు చేస్తే రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు తోడ్పాటు అందుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఆయా సమస్యలు పరిష్కరించి నియోజకవర్గ అభివృద్ధికి ముందుంటానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగని గళ్ళ మల్లయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాల్ రెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్ దూలం బైరా గౌడ్, మాజీ సర్పంచ్ మర్పల్లి రమేష్ గౌడ్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు పులి రాజు, సీనియర్ నాయకులు గురువారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దామోదర్‌కు శుభాకాంక్షలు



నవతెలంగాణ-జోగిపేట

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా దామోదర రాజనర్సింహ ప్రమాణ స్వీకారం చేయడంతో గురువారం నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాదులోని ఎల్బీ స్టేడియానికి తరలి వెళ్లారు. ప్రమాణ స్వీకారోత్సవ అనంతరం దామోదర రాజనర్సింహను కలిసి శాలువా, పూలమాలలు, పుష్పగుచ్చాలతో ఆయనకు అభినందనలు తెలియజేశారు. మంత్రి పదవి రావడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయనను కలిసిన వారిలో జోగిపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పద్మనాభరెడ్డి, అందోల్, టేక్మల్, వట్పల్లి మండలాల అధ్యక్షులు శివరాజ్, నిమ్మ రమేష్, రమేష్ జోషి, మాజీ సర్పంచులు ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, శివశంకర్ గౌడ్, పిల్లోడి సర్పంచ్ సతీష్, నాయకులు అనిల్ రాజ్ ఉన్నారు.

బసవలింగేశ్వర స్వామి ఆలయానికి కాంక్రీట్ అందజేత



నవతెలంగాణ-ఐడిఏ బొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ బసవ లింగేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికిగాను స్లాబ్ వేయడానికి అవసరమైన కాంక్రీట్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మన్ అంతిరెడ్డిగారి అనిల్‌కుమార్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణం పనులకు తనవంతు సాయం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బొల్లారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు కాటారం శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామచంద్ర గౌడ్, బెంబడి భాస్కర్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ బస్వరాజ్, శేఖర్, మధు, దేవాలయ నిర్మాణ పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా వైస్ చైర్మెన్ అనిల్‌కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-ఐడిఏ బొల్లారం

బొల్లారం వైస్ చైర్మెన్ అంతిరెడ్డిగారి అనిల్ కుమార్‌రెడ్డి పేదలకు అండగా నిలుస్తున్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో బొల్లారం పట్టణానికి చెందిన అంధుడు లక్ష్మణ్‌రావు రెండు సంవత్సరాల క్రితం ఓ ప్రమాదంలో గాయపడి చూపు కోల్పోయారు. తనకు పింఛన్ మంజూరు చేసి తన కుటుంబాన్ని ఆదుకోవాలని అనిల్‌కుమార్‌రెడ్డిని కోరారు. వెంటనే ఆయన పీఏ ద్వారా ఎల్‌వీప్రసాద్ ఆస్పత్రికి పంపించారు. ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందజేశారు. పింఛన్ ఇప్పించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. దీంతో బాధితుడు లక్ష్మణ్‌రావు అనిల్ కుమార్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

మంచు దుప్పటి



నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణాన్ని శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు మంచుతో కమ్మేసింది. పట్టణంలో ఎటు చూసినా పొగమంచు కనిపించింది. పిల్లలు, పెద్దలు పొగ మంచులో వాకింగ్ చేయడం కనిపించింది.

నవతెలంగాణ
మెదక్
శనివారం | 09 డిసెంబరు 2023 | www.navatelangana.com

హన్మంతరావును సన్మానించిన సొసైటీ సభ్యులు



నవతెలంగాణ -పాపన్నపేట

మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును శుక్రవారం కొత్తపల్లి రైతుసేవా సహకార సంఘం చైర్మన్ త్యార్ల రమేష్‌తో పాటు డైరక్టర్లు సన్మానించారు. ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్ మెదక్ ఎమ్మెల్యేగా గెలిచిన సంధర్భంగా మెదక్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవానికి వచ్చిన హనుమంతరావు కొత్తపల్లి సొసైటీకి సభ్యులతో గడిపారు. లక్ష్మీ నగర్ గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలతో ఆయన మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగమంచుతో వాహనదారుల ఇబ్బందులు



నవతెలంగాణ- నిజాంపేట

వాహనదారులు లైట్లు వేసుకొని వాహనాలను నడుపుతున్నది రాత్రిపూట కాదు సుమ ఢిల్లీలో అసలే కాదు.పొగ మంచు కురుస్తున్నదిమండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున దాదాపు 10 గంటలకు రోడ్డు వెంబడి వెళ్లే వాహనదారులకు రోడ్డు సరిగ్గా కనిపియక లైట్లు వేసుకొని నడుపుతున్నారు. అయినప్పటికీ రోడ్లు సరిగా కనిపించడం లేదు. వాతావరణ మార్పుల వలన పొగ మంచు కురుస్తుందని కొందరికి ఇబ్బందిగా ఏర్పడినప్పటికీ మరికొందరు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆడియోను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నిజాంపేట

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాచవరంలోని స్వగృహంలో రోహిత్ అన్న విజయోత్సవ గీతం ఆడియోను ఎమ్మెల్యే రోహిత్‌రావు ఆవిష్కరించారు. వల్లపు స్వామి రచించి, పాడిన పాటను రోహిత్ చేతుల మీదుగా ఆడియోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు సాయిచరణ్, రాజు, నాయకులు రావిపల్లి రవీందర్ రెడ్డి, నశిరోద్దీన్, శ్రీకాంత్ గౌడ్, వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, మహేష్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో వేముల రాజు (28) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషయాన్ని ఎంఎస్ఎస్ఓ సభ్యులు చరవాణి ద్వారా చైర్మన్, మెదక్ ఎమ్మెల్యే డా.మైనాంపల్లి రోహిత్ రావుకు తెలియజేశారు. తక్షణ సహాయం అంత్యక్రియల కోసం రూ.5000ల పంపించారు. వారి కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నార్లాపూర్ కాంగ్రెస్ మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ నాయకులు సభ్యులు బోయిని చంద్రం, బోయిని నాగరాజు, మ్యాదరి రాజు, బత్తుల యాదగిరి, గోధురి మహేష్, బత్తుల ప్రవీణ్, మిరుదొడ్డ కుమార్, కమ్మరి రవి, మంగలి స్వామి, సంగు ప్రశాంత్, గాలం లక్ష్మణ్, గాలం పెంటయ్య, సంగు ఎల్లం, బెజమైన చెంద్రం, తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నిజాంపేట వాసి



నవతెలంగాణ-నిజాంపేట

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నిజాంపేటకు చెందిన బండారి ప్రశాంత్‌ను రాష్ట్ర అధ్యక్షులు జానారెడ్డి నియమించారు. ఈ సందర్భంగా బండారి ప్రశాంత్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించినందుకు రాష్ట్ర శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 69వ జాతీయ మహాసభలను దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించడం జరుగుతుందన్నారు. గతంలో విద్యార్థుల కోసం సమయానికి బస్సులు రాకపోవడంతో వారికోసం రాస్తారోకో ధర్నా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఇకముందు కూడా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, జాతీయ పునర్నిర్మాణం కోసం పనిచేస్తానని ఆయన తెలిపారు. అలాగే విద్యార్థుల సమస్యలపై ఎల్లప్పుడూ పోరాటం చేస్తానన్నారు.

కామారెడ్డి ఎమ్మెల్యేను కలసిన బీజేపీ నాయకులు



నవ తెలంగాణ-సర్సాపూర్

కామారెడ్డి అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా విజయం సాధించిన వెంకటరమణారెడ్డిని స్థానిక బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం కామారెడ్డిలోని బీజేపీ కార్యాలయంలో నర్సాపూర్‌కు చెందిన బీజేపీ నాయకులు కౌన్సిలర్ బుచ్చేష్ యాదవ్, గోడ రాజేందర్‌తో పాటు నర్సాపూర్ మాజీ సర్పంచ్ వెంకట రమణారావుకు శివాజీ చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేసి, శాలువా కప్పి సన్మానించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌పై విజయం సాధించడం పట్ల వారు వెంకటరమణారెడ్డిని అభినందించారు.

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి అభినందనలు



నవ తెలంగాణ-రాయపోల్

దుబ్బాక ఎమ్మెల్యేగా గెలుపొందిన కొత్త ప్రభాకర్ రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు వడ్ల నాగులు అభినందించారు. కొత్త ప్రభాకర్ రెడ్డి స్వగ్రామం పోతారంలో శుక్రవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన సందర్భంగా నాగులు మాట్లాడారు. దుబ్బాక నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందారన్నారు. కొత్త ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందినందుకు రామారం బీఆర్ఎస్ నాయకులు కలిసి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలియజేశారు. ప్రభాకర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రామారం బీఆర్ఎస్ నాయకులు కుమ్మరి స్వామి, పేరుమని స్వామి, లక్మోళ్ళ సాయిబాబా, మన్నే వెంకట్, సత్యనారాయణ, కుమ్మరి నర్సింలు, బాబుల్, బాల్ రాజు, కుమ్మరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్పును స్వాగతిస్తున్నాం



బీఆర్ఎస్ యువజన మండలాధ్యక్షుడు మోహన్

నవతెలంగాణ-బెజ్జంకి

రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ప్రజలు కోరుకున్న మార్పును స్వాగతిస్తున్నామని శుక్రవారం బీఆర్ఎస్ యువజన మండలాధ్యక్షుడు బిగుల్ల మోహన్ అన్నారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రజా తీర్పు ప్రకారం రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి శుభాకాంక్షలు చెబుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి నిర్మాణ పనుల్లో, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని మోహన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

బేటి బచావో బేటి పడావో కరపత్రం ఆవిష్కరణ



నవతెలంగాణ-దుబ్బాక

బేటి బచావో బేటి పడావో అనే వాల్ పోస్టర్‌ను, కరపత్రాన్ని ఐసిడియస్ సీడీపీఓ చంద్రకళ ఆవిష్కరించారు. ఆడపిల్లలను రక్షిద్దాం-ఆడపిల్లలను చదివిద్దాం, ప్రతి ఆడపిల్ల అమూల్యమైనదని, వారిని చదివించి దేశాన్ని శక్తివంతం చేద్దామనే నినాదంతో దుబ్బాక వంద పడకల ఆసుపత్రిలో శుక్రవారం కరపత్రాలు, వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఆడపిల్లను రక్షిద్దాం- ఆడపిల్లను చదివిద్దామన్నారు. ఆడపిల్లకి జన్మనిచ్చిన తల్లి తండ్రులు, కుటుంబ సభ్యులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే బాలికల రక్షణ గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ డాక్టర్ ఐశ్వర్య, జిల్లా సాధికారత కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ వాసవి, జెండర్ స్పెషలిస్ట్‌లు లావణ్య పద్మ, పోషణ అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్ వెంకట ప్రసాద్, దుబ్బాక బ్లాక్ కో ఆర్డినేటర్ శ్యామ్సన్, స్టాఫ్ నర్సులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

భూకబ్జాలపై తొలి ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్

కేసీఆర్ ప్రాతినిధ్యం వహించిన గజ్వేల్ నియోజకవర్గంలో గత ఐదు సంవత్సరాలుగా జరిగిన అవినీతిని, అక్రమాలను, దౌర్జన్యాలను, భూ కబ్జాలను వివరించే గజ్వేల్ ఫైల్స్‌ను తూప్రాన్‌కు చెందిన సామాజిక కార్యకర్త, విద్యావేత్త కమ్మరి శ్రీనివాసచారి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి అందించారు. కొత్త రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారిగా శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో శ్రీనివాసచారి గజ్వేల్‌లో భూకబ్జాలకు సంబంధించిన వాటిపై ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కచ్చితంగా తగు చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని శ్రీనివాసచారి తెలిపారు. 2008 వైఎస్ హయాంలో తాను ప్రగతిభవన్లోకి అడుగు పెట్టానని 15 సంవత్సరాల తర్వాతే మళ్లీ ఇప్పుడు ప్రగతి భవన్‌లోకి ప్రవేశించే అవకాశం కలిగిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఒక నియంతృత్వ పాలన తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత వస్తుందని తాను ఊహించలేదన్నారు. కేసీఆర్ మంచి ఉద్యమకారుడు వ్యూహకారుడే కానీ, మంచి పరిపాలన దక్షుడు కాదని ఆయన అభిప్రాయపడ్డారు. కేసీఆర్ ప్రజా రంజకంగా పరిపాలన చేసి ఉంటే మరో 20 సంవత్సరాలు కేసీఆరే ఏకచిత్రాధిపత్యంతో పరిపాలించే వారని శ్రీనివాసాచారి స్పష్టం చేశారు. ప్రజల ముందు ఎంత అధికారం చెలాయిస్తే అంతగా ప్రజలు అణిచివేస్తారని కేసీఆర్ ఉదంతమే అందుకు సజీవ సాక్ష్యమని ఉద్ఘాటించారు. అధికారం ఎవ్వరికీ సొంతం కాదని ప్రజలకు మంచి చేసే ఉద్దేశం లేని వాళ్లు వ్యాపారాలు చేసుకోవాలని, రాజకీయాల్లోకి రావద్దని ఆయన సూచించారు. రాజకీయాల్లోకి పవిత్రమైన వారే ప్రవేశించాలని శ్రీనివాసాచారి హితవు పలికారు.

ప్రలోభపెట్టినా.. సొంత బిడ్డలా ఆదరించారు

- మెదక్ ప్రాంతాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తా
- ఆరు గ్యారెంటీలను అందరికీ చేరవేస్తాం
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు





నవతెలంగాణ-మెదక్

ప్రతిపక్ష పార్టీలు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా తమ సొంత బిడ్డగా ఆదరించి ఓట్లేసి గెలిపించారని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక పూజలు, హోమం, అమ్మవారి కుంకుమార్చన, నిర్వహించారు. ప్రధాన అర్చకులు వైద్య రాజు పంతులు, కోదండ రామాలయం ప్రధాన అర్చకులు భాష్యం మధుసూదనచారి, వైద్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముస్లిం, క్రిస్టియన్ మత గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేసి రోహిత్‌ను ఆశీర్వదించారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు-వాణి దంపతులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి రోహిత్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎంతో వెనకబాటుకు గురైన మెదక్‌ను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. సొంత బిడ్డగా ఆదరించి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. విజయాన్ని అందించిన ప్రజలకు ప్రాణం ఉన్నంత వరకు అన్ని విధాలుగా అండగా ఉండి అభివృద్ధి చేసి చూపిస్తానని వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలుచేసి ప్రతీ ఒక్కరికీ చేరువ చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ రెడ్డి, జీవన్ రావు, సురేందర్ గౌడ్, బొజ్జ పవన్, ప్రభాకర్ రెడ్డి, హఫీజ్, శంకర్, రాజేష్, శేఖర్, రాజలింగం, మంగ మోహన్ గౌడ్, మహేందర్ రెడ్డి, శ్రీకాంత్, మహేష్ గౌడ్లతో పాటు వేలాదిగా కార్యకర్తలు పాల్గొన్నారు.

మెదక్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- ఏడుపాయలను యాదాద్రిలా తీర్చిదిద్దుతాం
- మెదక్ రింగ్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తా
- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



నవతెలంగాణ-మెదక్

మెదక్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కృషి చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గ ప్రజల పదేళ్ల కల నెరవేరబోతుందన్నారు. ప్రసిద్ధిగాంచిన ఏడుపాయల వన దుర్గామాత ఆలయాన్ని యాదాద్రిలాగా తీర్చిదిద్దుతానని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు, పాత్రికేయుల కష్ట ఫలితమే తన కుమారుడు డాక్టర్ రోహిత్ రావు ఎమ్మెల్యేగా గెలుపొందడం జరిగిందన్నారు. యాదాద్రిలో అయ్యవారి ఆలయం ఎంత అభివృద్ధి జరిగిందో అదే స్థాయిలో ఏడుపాయలలో అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే రోహిత్ కృషి చేస్తారని హామి ఇచ్చారు. పదేళ్లపాటు మెదక్ ప్రజలు ఎన్నో కష్ట నష్టాలను చవిచూశారని, వారందరి అభివృద్ధి కలలు తన కుమారుడు నిజం చేసి చూపిస్తాడనే ధీమానిచ్చారు. మెదక్ పట్టణం చుట్టూ రింగ్ రోడ్డు ఏర్పాటుకు త్వరితగతిన కృషి చేస్తానని తెలిపారు. పదేళ్లపాటు అభివృద్ధికి నోచుకోని మెదక్ పట్టణాన్ని మిగతా జిల్లాల మాదిరిగా అన్ని విధాలుగా తీర్చిదిద్దేలా కృషి చేస్తారని తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ప్రజలు తమ సమస్యలను వెల్లడించడానికి నిరభ్యంతరంగా రావచ్చని తెలియజేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జీవన్ రావు, మహేందర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, బొజ్జ పవన్, ముత్యంరెడ్డి, భరత్ రెడ్డి, విప్లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

- సిద్దిపేట అడిషనల్ డీసీపీ అందే శ్రీనివాసరావు



నవతెలంగాణ-అక్కన్నపేట

ప్రతి విద్యార్థిని, మహిళలు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సిద్దిపేట అడిషనల్ డీసీపీ అందే శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థినీలకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో షీ టీం అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత, సైబర్ క్రైమ్ మోసాలు తదితర అంశాలపై క్లుప్తంగా వివరించారు. తెలియని ఫోన్ నెంబర్ల నుంచి ఫోన్ కాల్స్ వస్తే జాగ్రత్తగా పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ క్రైమ్ మోసాల నుంచి డబ్బులు ఆశ చూపి మోసం చేసే అవకాశం ఉందన్నారు. ఈ విషయంపై మహిళలు విద్యార్థినిలు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం చేకూరుతుందంటూ లాటరీ విధానం, లోన్ యాప్, పాన్ కార్డు అప్డేట్ ఆధార్ కార్డు లింక్ తదితర మెసేజ్‌లపై స్పందించకూడదని వివరించారు. ఒకవేళ సైబర్ క్రైమ్‌కు గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలపాలని అడిషనల్ డిసిపి అందే శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసిపి సతీష్, సిఐ కిరణ్, కేజీబీవీ ఎస్ఓ సరిత, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు షీ టీం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం సహకరించాలి

- ఎమ్మెల్యేను కోరిన గ్రామస్తులు



నవతెలంగాణ-తొగుట

గ్రామ అభివృద్ధి పనులకు సహకరించాలని దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డిని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, గ్రామ మాజీ ఉప సర్పంచ్ మంగ యాదగిరిలు కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే స్వగ్రామం పోతారంలో లింగంపేట గ్రామ బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందించి, శాలువతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి ఘనవిజయం సాధించారని తెలిపారు. భారీ మెజారిటీతో ఎమ్మెల్యే గెలుపు దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. అదేవిధంగా గ్రామ అభివృద్ధి కోసం సహకరించాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు వస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దాసరి సుదర్శన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అమీర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు షేఖ్ అబీద్ హుస్సేన్, మాజీ ఉప సర్పంచ్ గొడుగు బైరయ్య, బూత్ అధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, యూత్ అధ్యక్షుడు గణేష్, సోషల్ మీడియా అధ్యక్షుడు వంశీ, నాయకులు నర్సింలు, ధర్మయ్య తదితరులు ఉన్నారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



నవ తెలంగాణ రాయపోల్

మండలంలో పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రణాళికలలు రూపొందించుకోవాలని మండల విద్యాధికారి నరసమ్మ అన్నారు. శుక్రవారం బేగంపేట, ఎల్కల్ గ్రామాలలో పాఠశాలలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి గణితం ఉపాధ్యాయులకు శిక్షణలో భాగంగా ఉన్నతి కార్యక్రమం గురించి తగిన సూచనలు చేశారు. విద్యార్థులందరికీ చదవడం రాయడం వచ్చే విధంగా చతుర్వేద ప్రక్రియలు తప్పనిసరిగా అమలు జరిగేవిధంగా చూడాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి చదవడం, రాయడం వచ్చే విధంగా విద్యార్థులందరిపై తగిన సమయం కేటాయించాలని సూచించారు. పాఠశాలలో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలు చేసే విధంగా చూడాలన్నారు. విద్యార్థులందరూ ఆరోగ్యకరమైన పోటీ తత్వంలో విద్యను అభ్యసించాలని, చదువుకుంటేనే సమాజంలో గుర్తింపు, విలువ ఉంటుందన్నారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని, ఆ లక్ష్యం సాధించే దిశగా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. బాగా చదువుకొని తల్లిదండ్రులకు పాఠశాలకు పేరు తీసుకు వచ్చే విధంగా విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి, సీఆర్పీలు యాదగిరి, స్వామి, కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బూరుపల్లి గ్రామస్తులను అభినందించిన మైనంపల్లి



నవతెలంగాణ-హవేలి ఘనపూర్

మెదక్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా మైనంపల్లి రోహిత్‌ను గెలిపించడం పట్ల హవేలి ఘనాపూర్ మండలం బూరుగుపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అభినందించారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే హనుమంతరావులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామస్తులను కలిసి రోహిత్‌రావును ఎమ్మెల్యేగా గెలిపించడంలో బూరుగుపల్లిలో అత్యధిక మెజార్టీ రావడం సంతోషకరమని హనుమంతరావు అన్నారు. ఈ సందర్భంగా హన్మంతరావు మాట్లాడుతూ బూరుగుపల్లి గ్రామ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కారమయ్యే విధంగా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి అర్చన శ్రీనివాస్ మెదక్ మాజీ వైస్ ఎంపీపీ దుంబాల శంకర్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు మంజుల, జిల్లా జనరల్ సెక్రెటరీ లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు రాజు, సిద్ధగిరి గౌడ్, డాక్టర్ రాములు, శ్రీనివాస్ గౌడ్, వెంకట్ రాములు, అరికల బాలరాజ్, బిక్షపతి, యాదగిరి, బలరాం, మహేష్, సందీప్, బాబు, టిల్లు, పద్మారావు, వెంకట్, సిద్ధగిరి గౌడ్, భాస్కర్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్



నవతెలంగాణ-తొగుట

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడిల అనిత లక్ష్మారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. దుబ్బాక ఎమ్మెల్యేగా గెలుపొందిన కొత్త ప్రభాకర్ రెడ్డిని ఆయన స్వగృహం పోతారంలో శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో తుక్కాపూర్ వార్డు సభ్యులు బోయిని బాలరాజ్, బీఆర్ఎస్వి గ్రామ అధ్యక్షుడు లింగాల ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలి



నవతెలంగాణ-తొగుట

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడి కోరారు. శుక్రవారం అయన మాట్లాడుతూ తెలంగాణ జాతి పిత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రమాదం నుంచి త్వరగా కోలుకోవాలన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఉదయం 10 గంటలకు రాంపూర్ మదనానంద శారదా క్షేత్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ ప్రతినిధులు, గ్రామ పార్టీ, బూత్, యూత్, విద్యార్థి, సోషల్ మీడియా అధ్యక్షులు, బీఆర్ఎస్ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

నేడు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-తొగుట

తెలంగాణ రాష్ట్ర ప్రదాత తెలంగాణ తల్లి సోనియా గాంధీ జన్మదినం ఘనంగా నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి తెలిపారు. 60 ఏండ్ల ఆకాంక్షను నెరవేర్చిన సోనియా గాంధీ జన్మ దినం శనివారం ఘనంగా నిర్వహిస్తామన్నారు. మండల కేంద్రంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సోనియా పుట్టినరోజు వేడుకలలో మండల పరిధిలోని ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దుబ్బాక ఎమ్మెల్యేకు జెడ్పీటీసీ శుభాకాంక్షలు



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డికి జెడ్పీటీసీ కడతాల రవీందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిని శుక్రవారం పోతారం గ్రామంలో దుబ్బాక జెడ్పీటీసీ కడతాల రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కిషన్ రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం, శాలువాలను అందజేసి సన్మానించారు. కొత్త ప్రభాకర్ రెడ్డితోనే దుబ్బాక అభివృద్ధి సాధ్యమని వారు తెలిపారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



నవ తెలంగాణ-మిరుదొడ్డి

అక్బర్ పేట భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బత్తుల జీవానందం అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. బత్తుల జీవానందం కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి పరామర్శించి వారి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకుడు జీవానందం మృతి బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ షేర్ల కైలాసం, మాజీ ఎంపిపి పంజాల శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రవి, గ్రామ పార్టీ అధ్యక్షులు పెండేల రమేష్, బీఆర్ఎస్ నాయకులు చిరంజీవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాన్ని ప్రారంభించిన చైర్మన్



నవ తెలంగాణ-గజ్వేల్

అం అండ్ ఆర్ కాలనీ పల్లెపహాడు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర ఎలక్ట్రికల్ అండ్ హార్డ్వేర్ షాప్‌ను గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐదవవార్డ్ కౌన్సిలర్ శీర్ల శ్యామల మల్లేశం యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు నందియా, నాగరాజు, కొమ్ము నరేష్ యాదవ్, చింతకింది కనకయ్య, డీలర్ పోతుల నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన ప్రభుత్వానికి స్వాగతం



నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వానికి తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కోమండ్ల విక్రం రెడ్డి స్వాగతం తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డికి, మంత్రివర్గ సహచరులకు శుభాకాంక్షలు తెలిపారు. పదిలక్షల ఉద్యోగులు, ఉపాధ్యాయ, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. సమస్యలను త్వరలోనే పరిష్కరించే విధంగా ఆలోచన చేయాలని కోరారు. సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా ప్రభుత్వ ఉద్యోగులందరూ పని చేస్తారని అన్నారు. కార్యక్రమంలో సహాధ్యక్షుడు నిమ్మ సురేందర్ రెడ్డి, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు నరేష్, నగేష్, సిద్దిపేట కార్యదర్శి పవన్, యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు, ఫోరం అధ్యక్ష కార్యదర్శులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

దుద్దిల్ల శ్రీధర్ బాబును కలిసిన సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుని మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాడూరు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ హైదరాబాదులో మంత్రిని కలిసామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెందిరెడ్డి తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అండగా నిలిస్తే ఆమె విజేత

- పాలనలో మహిళలకు స్వేచ్ఛనిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి
- రాజకీయాలలో పెరిగిన మహిళల ప్రాధాన్యత
- గ్రామ సమస్యలపై అవగాహన కల్పిస్తే పరిష్కారం సులభం

నవతెలంగాణ-కోహెడ

సర్పంచ్‌గా గెలిచిన మహిళ పాలనాపరమైన బాధ్యతలు చూసుకునే విధంగా ఆమె కుటుంబీకులు ప్రోత్సహించాలి. కుటుంబ సభ్యులకు అనుభవం ఉంటే పరిస్థితులను బట్టి సలహాలు మాత్రమే ఇస్తూ సమస్యల పరిష్కారంలో వారినే దూసుకెళ్లేలా తోడ్పాటునందించాలి. తమ పతులు ఇంట్లో విషయాలను ఇంటి వద్దే వదిలేసి గ్రామాభివృద్ధిలో ఆమెకు సలహాలు సూచనలు ఇస్తూ ముందుకు నడిపించి తమకు అండగా నిలిస్తే ఆమె విజేతగా నిలుస్తుంది.

మహిళల ప్రాధాన్యత

రాజకీయాలలో మహిళల ప్రాతినిధ్యం పెంచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలలో వారికి 50 శాతం రిజర్వేషన్లను కల్పించింది. రిజర్వేషన్ల కోసం తప్పనిసరిగా మహిళలతో పోటీ చేయిస్తున్నా.. చాలా చోట్ల వారి భర్త, బంధువుల జోక్యమే ఉంటోంది. వారి చాటున కాకుండా, స్వతంత్రులుగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తేలికగా అంచనా వేయొద్దు

తొలిసారిగా సర్పంచ్‌గా గెలిచారని... మహిళా అంటూ, వారికి తెలియదని తేలికగా తీసేసి భర్తలే అన్ని నిర్ణయాలు తీసుకోకుండా చూడాలి. వారిని వారు నిరూపించుకునే విధంగా తోడ్పాటు అందిస్తే సరిపోతుంది. పంచాయతీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై, పన్నుల వసూళ్లు, వేతనాల చెల్లింపులు, ఖర్చుల వివరాలు, రికార్డుల నిర్వాహణ, బ్యాంకు లావాదేవీలను సొంతంగా నిర్వహించేలా వారినే నిర్ణయాలు తీసుకోనివ్వాలి. ఒక్కోసారి అది తప్పు జరగగా.. అనుభవం నుండి పాఠం నేర్చుకొని తర్వాత సక్రమంగా నిర్వహిస్తారు. వారి నిర్ణయాలకు అభ్యంతరాలు చెప్పక వారిలో ధైర్యం నింపే ప్రయత్నం చేయండి. పారదర్శకంగా నిర్ణయాలు తీసుకునేలా తగిన సూచనలు, సలహాలు ఇవ్వండి.

సమస్యలపై స్పందించేలా

గ్రామంలోని సమస్యలను తెలుసుకొని వాటిపై స్పందించేలా సన్నద్ధులను చేయాలి. గ్రామంలో ఓ రోడ్డువేయాలన్నా, చెత్త కుండీ ఏర్పాటు చేయాలన్నా, తాగునీటి పైపులైన్లు వేయాలన్నా, ప్రతిసారీ వారితోనే చేయించాలి. అధికారులు, ఉన్నతాధికారులతో మాట్లాడించి వారితో పలు విషయాలను తెలుసుకునేలా చూడాలి. చేయదలచుకున్న పనిపై సాధ్యాసాధ్యాలను వివరించి నిర్ణయాన్ని వారికే వదిలేస్తే మంచిది.

> మన దేశ రాష్ట్రపతిగా ప్రతిభాపాటిల్ సేవలందించారు. ప్రస్తుతం ద్రౌపతిముర్మ రాష్ట్రపతిగా కొనసాగుతున్నారు. తొలి మహిళా ప్రధానిగా స్వర్గీయ ఇందిరాగాంధీ పాలనలో తనదైన ముద్ర వేసుకున్నారు. షీలాదీక్షిత్ ఢిల్లీ ముఖ్యమంత్రిగా మూడు పర్యాయాలు బాధ్యతలు నిర్వర్తించారు. దేశంలో మమతా బెనర్జీ, మాయావతి, జయలలితలు ముఖ్యమంత్రులుగా పనిచేశారు. ఇలా ఎందరో మహిళల పాలనలో వారి ప్రతిభ చాటారు. వ్యాపార, ఐటీ తదితర అన్ని రంగాలలో రాణిస్తున్నారు. స్థానిక సంస్థలలో మాత్రం పదవి మహిలదే అయినా అధికారం మాత్రం పురుషులే చలాయిస్తున్నారు. రానున్న గ్రామపంచాయతీ ఎన్నికలలో విజయం సాధించిన అనంతరం మహిళలకు పాలనలో స్వేచ్ఛనిస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పలువురు పేర్కొంటున్నారు.

సమావేశాలలో మాట్లాడే నేర్పరి

ప్రతి మూడు నెలలకొకసారి నిర్వహించే మండల పరిషత్తు సమావేశాలకు సర్పంచ్‌లే హాజరు కావాల్సి ఉంటుంది. ఆ సమయంలో సమస్యలపై స్పందించి వారినే మాట్లాడే నేర్పరితనం కల్పించాలి. సర్వసభ్య సమావేశాలకు వారినే పంపించాలి అలాగే మండల జిల్లా స్థాయిలో నిర్వహించే అధికారిక సమావేశాలకు మహిళా సర్పంచ్‌లు హాజరయ్యేలా చూడాలి. దీనివల్ల ప్రభుత్వ విధానాలను అర్థం చేసుకొని ఇంటిని చక్కదిద్దినట్లు గ్రామాన్ని సైతం చక్కదిద్దుతారని చెప్పనక్కర్లేదని చెప్పవచ్చు.



గ్రామసభల నిర్వాహణ

నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రతి రెండు నెలలకు ఒకసారి గ్రామసభ నిర్వహించాల్సి ఉంటుంది. ప్రతినెల పంచాయితీ పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేయాలి. ఈ నేపథ్యంలో సమావేశాలకు స్వతంత్రంగా నిర్వహించేందుకు అవకాశం ఇవ్వాలి. అందుకు కావాల్సిన సహాయ సహకారాలు అందించాలి. ఇలా చేయడం వలన గ్రామంలోని సమస్యను తెలుసుకొని, తగిన పరిష్కారాన్ని కనుకొనే అవకాశం ఉంటుంది.

స్వతంత్రంగా విధులు నిర్వహించేలా..

మహిళలు సర్పంచ్‌లుగా ఎన్నికైన గ్రామాలలో పాలన విషయంలో వారి భర్త, బంధువుల జోక్యం చేసుకోకుండా సర్పంచ్‌గా తన బాధ్యతలను ఎలా నిర్వర్తించాలో వివరించాలి. వెన్నంటి ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. సర్పంచ్ పదవిలో చేయాల్సిన పనిని వారితోనే చేయించాలి. దీనివల్ల పాలనపై మరింత ధృష్టిసారిస్తారు. ప్రస్తుతం నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రతి పల్లెకు ఒక కార్యదర్శిని నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. పంచాయితీ కార్యదర్శితో గ్రామాభివృద్ధి గురించి చర్చించే స్వేచ్ఛను ఇవ్వాలి. పంచాయతీ రోజువారీ కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశం కల్పించాలి. పంచాయతీ పాలకవర్గ సమావేశాలను స్వతంత్రంగా నిర్వహించేలా తర్ఫీదునివ్వాలి. గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకొని పరిష్కరించేలా ప్రోత్సహించాలి.

రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారంతో సంబురాలు

నవతెలంగాణ-బెజ్జంకి

తెలంగాణ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడంతో మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని ముత్తన్నపేటలో కాంగ్రెస్ నాయకుడు కడగండ్ల పర్శరాములు ఆధ్వర్యంలో బాణాసంచాలు, టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేండ్ల తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వంలో బందీఅయిన రాష్ట్ర సంకెళ్లను తెంచి స్వేచ్ఛాయుత జీవనం సాగించడానికి కాంగ్రెస్‌కు పట్టంగట్టిన ప్రజలకు పర్శరాములు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త ప్రభాకర్‌రెడ్డికి అభినందనలు



నవతెలంగాణ-తొగుట

కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించిన సందర్భంగా శుక్రవారం ఆయన స్వగ్రామంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం లో గ్రామ అధ్యక్షుడు పులిగారి శివయ్య,నాయకు లు పిట్ల వెంకటయ్య,ఓలపు నారాయణ,పాల లక్ష్మీ నర్సాగౌడ్,సిరిసిల్లా రాజేశం,బండారు స్వామి గౌడ్, గ్రామ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

పేదంటి బిడ్డ పెళ్లికి పుస్తె మట్టెల అందజేత



నవతెలంగాణ- సిద్దిపేట

అలయన్స్ సిద్దిపేట జిల్లా జోన్ చైర్మన్ మంకాల నాగరాణి నవీన్ కుమార్ దంపతుల సహకారంతో దోభీగల్లీలో పేద కుటుంబానికి చెందిన మహేశ్వరి పెళ్లి నిమిత్తం పుస్తె మట్టెలు, పెళ్లిచీర, ఇతర పెళ్లి సామగ్రి అందించారని వనమాలి క్లబ్ అధ్యక్షులు వాసవి తెలిపారు. కార్యక్రమంలో స్వరాజ్యం క్లబ్ అధ్యక్షురాలు గరిపల్లి భవాని, సభ్యులు సుప్రియ, ఇతర సభ్యులు ఆత్మ రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆ రెండు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- టీపీసీసీ సభ్యులు కేడం లింగమూర్తి



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10 లక్షల విలువైన ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీపీసీసీ సభ్యులు కేడం లింగమూర్తి కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు యూత్ కాంగ్రెస్‌తో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి చిత్తారి రవి, సింగిల్ విండో చైర్మన్ బోలిశెట్టి శివయ్య, హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బంక చందు, సింగిల్ విండో డైరెక్టర్ గుర్రాల లింగా రెడ్డి, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బినవేన రాకేష్ , కౌన్సిలర్లు చిత్తారి పద్మ వల్లపు రాజు, భుక్యా సరోజన, నాయకులు వెన్న రాజు, బూరుగు కిష్ట స్వామి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌సెట్ అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థి



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఇటీవలే ఎంఏ తెలుగు పూర్తి చేసుకున్న విద్యార్థిని మూటకోడూరు స్రవంతి, ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన రాష్ట్ర స్థాయి టీఎస్‌సెట్ అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కాలేజీలో విద్యార్థినిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టిన స్రవంతి అనే అమ్మాయి పట్టుదలతో చదివిందన్నారు. రాష్ట్రస్థాయి అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం కళాశాలకు గర్వకారణం అన్నారు.ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. లక్ష్య సాధనలో ఎలాంటి ఆటంకాలు ఎదురైనా ఏమాత్రం వెనుకడుగు వేయరాదన్నారు. కష్టాలనే విజయాలకు బాటలుగా మలచుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థినికి ప్రోత్సాహకంగా రూ.వెయ్యి బహుమతి అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ యస్.గణపతి రావు, తెలుగు విభాగం అధ్యక్షులు డా.టి.కవిత, అధ్యాపకులు బాలరాజు, రమేశ్ బాబు, విజయ భాస్కర్ రెడ్డి, ఓం ప్రకాశ్, రాజు, సాయిక్రిష్ణ,రాజశేఖర్, కమలాకర్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ బాధితునికి అప్పగించిన ఎస్ఐ



నవతెలంగాణ-చేర్యాల

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ను సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్ స్వాధీనం చేసుకుని శుక్రవారం చేర్యాల పోలీస్ స్టేషన్ లో బాధితునికి ఎస్ఐ రామ్మోహన్ అప్పగించారు.ఎస్ఐ రామ్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన అరకాల కనకరాజు అనే వ్యక్తి తన మొబైల్ ఫోన్ అక్టోబర్ 16న పోగొట్టుకున్నారు. ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన వెబ్సైట్లో ఫోన్ యొక్క ఐఎంఈఐ నెంబర్‌ను ఎంటర్ చేసి, బ్లాక్ చేశాడు. వెంటనే ఫోన్ దొరికిన వ్యక్తి దానిలో సిమ్ కార్డు వేసుకోవడంతో, ఈ వెబ్సైట్ ద్వారా అతని వివరాలతో కూడిన సమాచారం చేర్యాల పోలీసులకు చేరింది. సమాచారం అందుకున్న పోలీసులు ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి ఫోన్ ను స్వాధీనం చేసుకుని, పోగొట్టుకున్న వ్యక్తికి ఎస్ఐ రామ్మోహన్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైతే ఫోన్ కోల్పోయిన వారు వెంటనే ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌ను నేరుగా బ్లాక్ చేయవచ్చుని, తద్వారా కోల్పోయిన ఫోన్‌ను తిరిగి తొందరగా పొందుతారని తెలిపారు.

నూతన ప్రభుత్వంలో సమస్యలు పరిష్కారం



నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలో అతిథి అధ్యాపకుల సమస్యలు పరిష్కారమవుతాయని సిద్దిపేట జిల్లా సంఘం అధ్యక్షుడు శ్రీసింగపాక కైలాష్, ఉపాధ్యక్షులు శివశంకర్, కార్యదర్శులు రాజశేఖర్, రాజు ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి సీఎం రేవంత్‌రెడ్డికి జిల్లా సంఘం తరపున శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా అతిథి అధ్యాపకుల వేతనాలు పెంచడం, ఆటో రెన్యూవల్ ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు.

సద్ది రాజిరెడ్డిని పరామర్శించిన దుబ్బాక ఎమ్మెల్యే

నవతెలంగాణ దుబ్బాక రూరల్



దుబ్బాక మండలం పెద్దగుండవెళ్లి గ్రామ సర్పంచ్ సద్ది రాజిరెడ్డి తల్లి వజ్రవ్వ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం బీఆర్ఎస్ నాయకుల ద్వారా తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వజ్రమ్మ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట దుబ్బాక జెడ్పీటీసీ కడతల రవీందర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రొట్టె రాజమౌళి పంతులు, మూర్తి శ్రీనివాస్ రెడ్డి, రవి, రాజు, కార్తిక్ తదితరులు ఉన్నారు.

రూ.22 కోట్ల మున్సిపల్ నిధుల టెండర్ల పరిస్థితి ఏమిటి?



నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని సీసీరోడ్లు, మురికి కాలు నిర్మాణానికి అప్పటి తెలంగాణ ప్రభుత్వం రూ.22 కోట్లు మంజూరు చేసింది. 2023 ఎన్నికల సమీపిస్తున్నా నిబంధనల ప్రకారం టెండర్లు నిర్వహించలేకపోయారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు చేపట్టలేకపోయారు. టెండర్లు వేసే దశలో ఉన్నాయని సంబంధిత శాఖ అధికారులు తెలుపుతున్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఒకరి రెండు వార్డుల్లో కొన్ని సీసీరోడ్లు పూర్తయినప్పటికీ మిగతా వార్డుల్లో పనులు ప్రారంభించలేకపోయారు. ఎన్నికల షెడ్యూల్ రావడంతో సంబంధిత శాఖ అధికారులు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టెండర్లు ఏర్పాటు చేద్దామని చెప్పడంతో మున్సిపల్ పాలకవర్గం, కౌన్సిల్ సభ్యులు వెనకడుగు వేశారు. దీంతో ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీకి చెందిన రావడంతో 22 కోట్ల నిధుల పరిస్థితి ఏమిటి అని సభ్యులు ఆవేదన చెందుతున్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో ఇంకా అండర్ డ్రైనేజీ కావలసిన 50 కోట్ల నిధులు కావాల్సింది. 100 కోట్లు కేటాయించినప్పటికీ పనులు పూర్తి కాలేకపోయాయి మరో 50 కోట్లు కావాలని అప్పుడే ప్రభుత్వం తరపున మున్సిపల్ పాలకవర్గం ప్రతిపాదన పంపింది. కానీ ఇప్పటివరకు అమలు కాలేదు. ముఖ్యమంత్రి కెసిఆర్ అప్పట్లో ఉండటం వల్ల నిధులు భారీగా వచ్చినప్పటికీ స్థానిక కౌన్సిల్ పాలకవర్గం మధ్యన కొంత గ్యాప్ రావడంతో పనులు ముందు సాగలేకపోయాయి. తిరిగి మూడోసారి కూడా తెలంగాణ ప్రభుత్వం వస్తదని విశ్వాసంతో మున్సిపల్ పాలకవర్గం నిండా మునిగి ఉంది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రావడం వల్ల చేపట్టిన పనులకు బిల్లులు ఎలా తీసుకోవాలని, చేపట్టబోయే పనులు ఎలా చేపట్టాలని తర్జనభజన పడుతున్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని మొత్తం 20 వార్డులు ఉండగా వార్డుల్లో కొన్ని పనులు జరిగినప్పటికీ ఇంకా 95% పనులు మున్సిపల్ పరిధిలో పెండింగ్ లో ఉన్నాయి. ఇక్కడ మాత్రం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గెలుపొందడంతో అధికార పార్టీ కాంగ్రెస్ నాయకులు తీసుకున్న నిర్ణయాలపై ఆసక్తిగా ఉంది. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పాల్గొన్న పూర్తిగా కాంగ్రెస్ వైపు వెళుతుందా? లేదా భారత రాష్ట్ర సమితి వైపే ఉంటుందని ఇంకా తేలడం లేదు. మున్సిపల్ ఎన్నికలు మరో ఏడాది కాలము ఉండటం వల్ల ఈ కాలం లో పనులు జరగాలంటే మా పరిస్థితి ఏమిటి అని కౌన్సిల్ సభ్యులు ప్రశ్నించుకుంటున్నారు. అంతేకాకుండా అనేక పనులు పెండింగ్లో ఉన్నాయి. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఉండటం వల్ల ఏ స్థాయిలో సమీక్షిస్తారో ఇంకా ఒక నిర్ణయానికి రాలేకపోతున్నారు. గతంలో మాజీ మంత్రి హరీష్ రావు గజ్వేల్ నియోజకవర్గం లో అభివృద్ధి పనులను సమీక్షించి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసేవారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రావడం వల్ల పూర్తిస్థాయిలో వారి పరిధిలోకి వెళ్లిపోయింది. ఏది ఏమైనా గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని పెండింగ్ పనుల పరిస్థితి అధ్వానంగా మారిందని చెప్పాలి.

రూ 22 కోట్ల నిధులు టెండర్ కాలేదు: మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని సిసి రోడ్లు, మురికి కాల్వలు కావాల్సిన పనులకు రూ.22 కోట్ల టెండర్లు పూర్తి కాలేదు. ఎన్నికలు రావడంతో సంబంధిత శాఖ అధికారులు ఒప్పుకోలేదు. ఎన్నికల తర్వాత టెండర్లు వేద్దామని చెప్పడంతో ఆ శాఖ అధికారులు వెనకడుగు వేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నిర్ణయం ప్రభుత్వ అధీనంలో ఉంది. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని అనేక వార్డుల పనులు నిలిచిపోయాయి. నూతన ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

గజ్వేల్ మార్కెట్ కమిటీ పాలకవర్గం రాజీనామా



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మార్కెట్ కమిటీ పాలకవర్గం రాజీనామా చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ప్రకటించారు. శుక్రవారం మార్కెట్లో గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, డైరెక్టర్లందరితో కలిసి రాజీనామా పత్రాన్ని సెక్రటరీ జాన్వెస్లీకి అందజేశారు. తెలంగాణా ఉద్యమ కాలం నుండి కెసిఆర్ అడుగుజాడల్లో నడుస్తూ వచ్చిన తనకు, తన సతీమణికి రెండు పర్యాయలు మార్కెట్ కమిటీ చైర్మన్గా అవకాశం కల్పించడం పట్ల కెసిఆర్కి జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు.ఈ ముడున్నరెళ్ల కాలంలో సహకరించిన డైరెక్టర్లు సిబ్బంది వ్యాపార వర్గాలు, రైతులు, అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాదని ప్రజల సేవలో నిరంతరం కెసిఆర్ నాయకత్వంలో పనిచేస్తామని గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించిన కెసిఆర్ గారికి హరీష్ రావు కి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో రైతులకు ఎటువంటి సమస్యలు ఎదురైనా ముందుండి పనిచేస్తామని అన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి



నవ తెలంగాణ-కొండపాక

గుండెపోటుతో వ్యక్తి హఠాన్మరణం చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కుకునూర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ఈగ బాల్ నర్స(40) కిరణం షాప్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం షాపు తీయడానికి వెళ్తున్న క్రమంలో ఆకస్మికంగా గుండెలో నొప్పి రావడంతో చికిత్స కోసం సిద్దిపేటకు తరలించారు. మార్గమధ్యంలోనే తుది శ్వాస విడిచాడు. మృతుడికి భార్య కూతురు కుమారుడు ఉన్నారు.

అందరికీ ధన్యవాదాలు



నవతెలంగాణ-గజ్వేల్

ఇన్నాళ్లు సహకరించిన గజ్వేల్ నియోజకవర్గంలోని పెద్దలందరికీ గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం మార్కెట్ కమిటీలో మీడియాతో ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలు సహకరించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ చైర్మన్‌గా తన సతీమణిని, తనను ప్రోత్సహించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు



నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే పాత పెన్షన్ అమలు చేయాలని పాత పెన్షన్ సాధన సమితి నాయకులు నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 317జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. 13 జిల్లాలలో నిలిచిపోయిన దంపతుల బదిలీ చర్యలు చేపట్టాలన్నారు. సమావేశం ల పాత పెన్షన్ సాధన సమితి కన్వీనర్ తాళ్ల నాగరాజు, నాయకులు బోడ వేణు, గోక విద్య సాగర్, మాల్యగల్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

సద్ది రాజిరెడ్డికి మాతృవియోగం



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ సద్ది రాజిరెడ్డి మంగళవారం మాతృవియోగానికి గురయ్యారు. అనారోగ్యంతో సర్పంచ్ తల్లి రాజవ్వ (80) మృతి చెందడంతో కుటుంబీకులు శోకసంద్రంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సర్పంచ్ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. అనంతరం కుటుంబీకులు అంత్యక్రియలు నిర్వహించారు.